నేటి నిజం
తెలుగు దినపత్రిక
website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com
హైదరాబాద్ ఆదివారం 12-4-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:190 పేజీలు:6 వెల: రూ.1/-

**నేటి కందం- నేటికి అందం**

**దీపించెడి సింధీలో**
**ప్రాపును గలిగించు రీతి రాజ్యాంగంబున్**
**సీ పీ రాధాకృష్ణను**
**లోపము లేకుండ చేసె లోకార్పణమున్ !!**

(భారత ఉప రాష్ట్రపతి శ్రీ సీ పీ రాధాకృష్ణన్ సింధీ భాషలో భారత రాజ్యాంగాన్ని ఆవిష్కరించారు.)



-రాధశ్రీ
సెల్:9494481210

**చురక**

**వెలిసిపోని జెండా**
**విలువ తగ్గిని దండా**
**అతడు శక్తే వ్యక్తికాదు**
**ఐతే ఏది ప్రజల అండ**
**కొంతవరకే ఎవరికైనా**
**కొనసాగును వ్యక్తిపూజ**
**రాజకీయ ఇమేజంతా**
**రాలిపోతే ఖాళీ కూజ**



-వేల్పుల నారాయణ
9440433475

# ఇంత ఉత్సాహాన్ని గుజరాత్‌లో కూడా ఎన్నడూ చూడలేదు.. బెంగాల్ ఎన్నికల ప్రచారసభలో ప్రధాని మోదీ



న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 11:పశ్చిమబెంగాల్ లో తన ప్రచార సభలకు వస్తున్న జనాన్ని, వారి ఉత్సాహాన్ని తన సొంత రాష్ట్రమైన గుజరాత్ లో కూడా ఎన్నడూ చూడలేదని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ఈరోజు మధ్యాహ్నం తూర్పు బర్ధమాన్ జిల్లాలో జరిగిన ఎన్నికల ప్రచారసభలో ప్రధాని మాట్లాడారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంత భారీ సభను గుజరాత్‌లో కూడా ఏర్పాటు చేయలేకపోయేవాళ్లమని, మే 4 తర్వాత రాష్ట్రంలో మార్పులు రాబోతున్నాయనడానికి ఈ సభలే నిదర్శనమని అన్నారు.

ఈ సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్‌పై మోదీ తీవ్ర విమర్శలు చేశారు. బెంగాల్‌లో బీజేపీ అధికారంలోకి వస్తే.. గత 15 ఏళ్ల టీఎంసీ పాలనలో జరిగిన అవినీతిపై శ్వేతపత్రం విడుదల చేస్తామని హామీఇచ్చారు. బీజేపీ వస్తే సంక్షేమ పథకాలు ఆగిపోతాయని టీఎంసీ భయాందోళనలు సృష్టిస్తోందని.. ఒక్క సంక్షేమ పథకాన్ని కూడా నిలిపివేయబోమని స్పష్టంచేశారు. కేవలం తృణమూల్ నేతల అవినీతి, దోపిడీ దుకాణాలను మాత్రమే మూసివేస్తామని చెప్పారు.

తాము అధికారంలోకి వస్తే కొత్త ముఖ్యమంత్రి నేతృత్వంలోని తొలి కేబినెట్ సమావేశంలోనే రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ పథకం అమలుకు తీర్మానం చేస్తామని మోదీ ప్రకటించారు. ఇన్నాళ్లూ ఈ పథకాన్ని అమలు చేయకుండా తృణమూల్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేసిందని, బీజేపీ ప్రభుత్వంతో ఆ రోజులు ముగిసిపోతాయని తెలిపారు. కొత్త ప్రభుత్వం చొరబాటుదారులపై కఠిన చర్యలు తీసుకుంటుందని అన్నారు. వారికి నకిలీ గుర్తింపు పత్రాలు సృష్టించి ఇక్కడ స్థిరపడటానికి సాయం చేసిన వారిని కూడా వదిలిపెట్టబోమని మోదీ హెచ్చరించారు.కాగా పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు విడుతల్లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరుగనుంది. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి. ఇక కేరళ, పుదుచ్చేరి, అస్సాంలో ఈ నెల 9న పోలింగ్ ముగిసింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఈ నెల 23న జరుగనుంది. ఈ అన్ని రాష్ట్రాల్లో ఎన్నికల ఫలితాలు మే 4న విడుదల కానున్నాయి.

# ఎన్టీఆర్ జిల్లా కీసర టోల్ ప్లాజా వద్ద ఘోర ప్రమాదం..

ఎన్టీఆర్ జిల్లా, ఏప్రిల్ 11: కంచికచర్ల మండలం కీసర టోల్ గేట్ వద్ద ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. బీఎండబ్ల్యూ కారుపై సిమెంట్ ప్లయాస్ లోడుతో వెళుతున్న లారీ బోల్తాపడింది. విజయవాడ నుంచి హైదరాబాద్ వెళుతున్న కారు.. టోల్ కట్టేందుకు ప్లాజా వద్ద ఆగింది. వేగంగా వచ్చిన లారీ అదుపుతప్పి దానిపై బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న హైదరాబాద్‌కు చెందిన ఏపీ, తెలంగాణ హైకోర్టుల సీనియర్ న్యాయవాది బొద్దులూరి శ్రీనివాసరావు మృతిచెందారు.

ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన టోల్ గేట్ సిబ్బంది, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. మూడు జేసీబీల సహాయంతో అతి కష్టంగా మీద లారీని పైకి లేపారు. ప్రమాద సమయంలో కారులో శ్రీనివాసరావు ఒక్కరే ఉన్నారని, ఆయనే డ్రైవ్ చేస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. ఈ ప్రమాదంతో విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోయింది. శనివారం కావడంతో రహదారిపై వాహనాల రద్దీ అధికంగా ఉంది. కాగా, వాహనాలు ప్రస్తుతం ఒకవైపు మాత్రమే నడుస్తున్నాయి.

# నేనెక్కడా అవినీతి చేయలేదు: సీతక్క



ములుగు, ఏప్రిల్ 11 వేడారం సమ్మక్క- సారక్క అమ్మవార్ల గద్దెల పున: నిర్మాణ పనుల్లో ఎక్కడ అవినీతి జరగలేదని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గద్దెల పున: నిర్మాణ పనుల్లో అవినీతి జరిగిందని అంటున్నారని.. ఆధారాలు ఉంటే చూపించాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. అవసరమైతే సీబీఐ విచారణ జరపాలని సూచించారు. ఈరోజు(శనివారం) ములుగులో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పర్యటించారు. మహేశ్ గౌడ్‌కు గట్టమ్మ దేవాలయం వద్ద మంత్రి సీతక్క, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. గట్టమ్మ దేవాలయంలో మహేశ్ కుమార్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గట్టమ్మ దేవాలయం నుంచి భారీ బైక్ ర్యాలీగా ములుగు పట్టణ కేంద్రానికి నాయకులు, కార్యకర్తలు బయలుదేరారు.

ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడాన్ని బీఆర్ఎస్ నేతలు తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. ఎన్నికల్లో తనను ఓడించేందుకు రూ.వందల కోట్లు ఖర్చుచేశారని, తనపై తప్పుడు ప్రచారం చేశారని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తనను ప్రలోభాలకు గురిచేశారని.. అయినా తాను వారికి లొంగలేదని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లకు ఇచ్చే ఫోన్లలో అవినీతి జరిగిందని... అవినీతి సీతక్క అంటున్నారని.. జాగ్రత్తగా మాట్లాడాలని హెచ్చరించారు. తానెక్కడా అవినీతి చేయలేదని స్పష్టం చేశారు. రూ. 11,650లకు ఫోన్లు కొంటే.. రూ. 14000వేలని ప్రచారం చేస్తున్నారని మంత్రి సీతక్క ఆగ్రహించారు.

# హైదరాబాద్‌లో జీసీసీ ఏర్పాటుపై పీకో టెక్నాలజీ ఆసక్తి: మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, ఏప్రిల్ 11:న్యూయార్క్ కేంద్రంగా పనిచేస్తున్న పీకో టెక్నాలజీ ఇండియా హైదరాబాద్‌లో జీసీసీ ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపిస్తోందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో పీకో టెక్నాలజీ విస్తరణకు ప్రణాళికలు రచిస్తున్నామని పేర్కొన్నారు. ఈరోజు(శనివారం) తెలంగాణ సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబుతో పీకో టెక్నాలజీ ప్రతినిధులు సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు.

5 నుంచి 20 సంవత్సరాల అవసరాలకు సరిపడే మౌలిక సదుపాయాల కోసం ప్రణాళికలు చేస్తున్నామని అన్నారు. హైదరాబాద్ జీసీసీల ల గమ్యస్థానమని పేర్కొన్నారు. గ్లోబల్ ఫైనాన్స్ కంపెనీలు హైదరాబాద్‌కు వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నాయని తెలిపారు. బెంగళూరు, ముంబైతో పోలిస్తే తక్కువ ట్రాఫిక్, కాలుష్యం హైదరాబాద్‌కు అడ్వాంటేజ్ అని తెలిపారు. ఆఫీస్ ఆక్యుపెన్సీ హైదరాబాద్‌లో 73శాతం, ముంబైలో కేవలం 52శాతం మాత్రమేనని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

# ఇరాన్‌తో 39 రోజులు సాగిన యుద్ధం.. 39 యుద్ధ విమానాలు కోల్పోయిన అమెరికా



న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 11: ఇరాన్ పై అమెరికా చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' లో అగ్రరాజ్య సైన్యానికి భారీనష్టం జరిగినట్లు తెలుస్తోంది. దాదాపు 39 రోజులపాటు యుద్ధం కొనసాగగా.. అగ్రరాజ్యానికి చెందిన 39 విమానాలను ఇరాన్ ధ్వంసం చేసింది. ఫిబ్రవరి 28న ఇజ్రాయెల్ తో కలిసి ఇరాన్ పై అగ్రరాజ్యం విరుచుకుపడటంతో పశ్చిమాసియా లో యుద్ధజ్వాలలు చెలరేగాయి. ఇరాన్ ప్రతీకార దాడులతో ఉద్రిక్తతలు తీవ్రరూపం దాల్చాయి.ఐదు వారాలకుపైగా కొనసాగిన ఈ ఘర్షణల్లో యూఎస్‌కు చెందిన 39 విమానాలు ధ్వంసమైనట్లు తెలుస్తోంది. మరో 10 విమానాలు వివిధ స్థాయిల్లో దెబ్బతిన్నట్లు సమాచారం. కూలిన అమెరికా విమానాల్లో ఒక ఏ-10, నాలుగు ఎఫ్-15 స్ట్రైక్ ఈగిల్ యుద్ధవిమానాలు ఉన్నాయి. ఇరాన్ గగన తలంలో అమెరికా ఎఫ్-35 స్టెల్త్ యుద్ధవిమానం ఒకటి దెబ్బతిన్నది. అగ్రరాజ్యం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే ఈ ఐదోతరం యుద్ధ విమానం పోరాటంలో శత్రుదాడికి గురికావడం ఇదే తొలిసారి.

సౌదీ అరేబియాలోని ఓ వైమానిక స్థావరంపై ఇరాన్ జరిపిన క్షిపణి దాడిలో ఐదు కేసీ-135 రీఫ్యూయలింగ్ విమానాలు దెబ్బతిన్నాయి. అయితే వాటిల్లో కొన్నింటికి మరమ్మతులు చేశారు. సౌదీ వైమానిక స్థావరంపై జరిగిన దాడిలో అగ్రరాజ్యానికి చెందిన అత్యాధునిక 'బోయింగ్ ఈ-3 సెంట్రీ నిఘా విమానం కూడా తీవ్రంగా ధ్వంసమైంది. ఇక యూఎస్‌కు చెందిన నాలుగు F-15E ఫైటర్ జెట్‌లు కూడా కూలిపోయాయి. వీటిల్లో మూడు కువైట్‌లో జరిగిన 'ఫ్రెండ్లీ ఫైర్' లో భాగంగా కూలినట్లు యూఎస్ సెంటకామ్ పేర్కొన్నది.

కువైట్‌లోని అమెరికా స్థావరంపై జరిగిన డ్రోన్ దాడిలో ఒక అఊ-47 చినూక్ హెలికాప్టర్ ధ్వంసమైందని ఇరాన్ మీడియా తెలిపింది. ఇవిగాక ఈ ఘర్షణల్లో అమెరికాకు చెందిన డ్రోన్ విభాగానికి భారీగా నష్టం జరిగింది. దాదాపు 24 MQ-9A రీపర్ డ్రోన్‌లు ధ్వంసమయ్యాయి.

# హోర్ముజ్‌ను దాటిన భారత నౌక.. కాల్పుల విరమణ తరువాత తొలిసారిగా..

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 11:యూఎస్, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరాక తొలిసారిగా ఒక భారత రిజిస్టర్డ్ నౌక హోర్ముజ్ జలసంధిని సురక్షితంగా దాటింది. ఎల్‌పీజీతో బయలుదేరిన జగ్ విక్రమ్ నౌక శుక్రవారం రాత్రి జలసంధిని దాటినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. దీంతో, మార్చి నుంచి ఇప్పటివంకూ హోర్ముజ్‌ను దాటిన భారత సరకు రవాణా నౌకల సంఖ్య 9కి చేరింది. అంతేకాకుండా, ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్ జలాల్లో మరో 15 భారత రిజిస్టర్డ్ నౌకలు ఉన్నాయి. ఇవి కూడా త్వరలో హోర్ముజ్‌ను దాటనున్నట్టు తెలుస్తోంది.

మీడియా కథనాల ప్రకారం, శనివారం మధ్యాహ్నానికి జగ్ విక్రమ్ నౌక హోర్ముజ్‌కు తూర్పున ఉన్న గల్ఫ్ ఆఫ్ ఒమాన్ జలాల్లో ప్రయాణిస్తోంది. ఈ నౌకలో సుమారు 20 వేల టన్నుల ఎల్‌పీజీ ఉన్నట్టు సమాచారం. మధ్యస్థాయి సరకు రవాణా సామర్థ్యం కలిగిన ఈ నౌక ముంబైలోని గ్రేట్ ఈస్టర్న్ కంపెనీకి చెందినది. మరికొన్ని రోజుల్లో ఈ నౌక భారత్‌కు చేరుకుంటుంది.

గల్ఫ్‌లో ఉద్రిక్తతలు మొదలైన నాటి నుంచీ అనేక నౌకలు హోర్ముజ్‌కు పశ్చిమాన ఉన్న పర్షియన్ గల్ఫ్ జలాల్లో నిలిచిపోయాయి. జగ్ విక్రమ్‌తో పోలిస్తే రెండింతల సామర్థ్యం ఉన్న గ్యాస్ క్యారియర్లు కూడా వీటిల్లో ఉన్నాయి. ఇక ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్‌లోని భారత నౌకల్లో ఒక ఎల్‌పీజీ ట్యాంకర్, నాలుగు ముడి చమురు ట్యాంకర్లు, ఒక ఎల్ఎన్‌జీ క్యారియర్, ఒక కెమికల్ ఉత్పత్తుల ట్యాంకర్, మూడు కంటెయినర్ ట్యాంకర్లు, రెండు బల్క్ క్యారియర్లు ఉన్నాయి. వీటితో పాటు కొన్ని ట్యాంకర్లకు మరమ్మతులు జరుగుతున్నట్టు సమాచారం.

# ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే 200వ జయంతి వేడుకలు.



సంగారెడ్డి, ఏప్రిల్ 11(నేటి నిజం ప్రతినిధి) సామాజిక సమానత్వం, మహిళా విద్యకు మార్గదర్శకుడైన మహాత్మా జ్యోతిరావు పూలే 200వ జయంతి వేడుకలను సంగారెడ్డి జిల్లాలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత సంతోష్, అదనపు కలెక్టర్ పాండు తదితరులు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నటరాజ్ థియేటర్ సమీపంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

**సమానత్వం కోసం పూలే కృషి చిరస్మరణీయం**

ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ, సమాజంలో సమాన హక్కులు, మహిళా విద్య కోసం మహాత్మా పూలే చేసిన కృషి అమూల్యమని పేర్కొన్నారు. మహిళల విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవల ఫలితంగానే నేడు మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని తెలిపారు. యువత పూలే ఆలోచనలను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి ప్రాధాన్యత ఇస్తూ పాఠశాలలు, హాస్టళ్లలో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తోందని తెలిపారు. ముఖ్యంగా బాలికల విద్యాభివృద్ధి, భద్రత కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటూ, డిగ్రీ మరియు జూనియర్ కళాశాలల విద్యార్థినులకు హాస్టల్ సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

పూలే దంపతుల సేవలు ఆదర్శప్రాయము

జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ, సమానత్వం, విద్యా విస్తరణ, మహిళా సాధికారత కోసం మహాత్మా జ్యోతిరావు పూలే అహర్నిశలు కృషి చేసిన మహనీయుడని అన్నారు. మహిళా విద్యకు పునాది వేసిన సావిత్రిబాయి పూలే సేవలను స్మరించారు. పూలే దంపతుల స్ఫూర్తితో యువత సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు.

**విద్యార్థుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు**

జిల్లాలోని బీసీ వసతి గృహాల్లో విద్యార్థుల కోసం సి.ఎస్.ఆర్ నిధుల కింద రూ.35 లక్షలతో ట్రంక్ బాక్సులు తదితర సౌకర్యాలు కల్పించినట్లు కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా రూ.1.52 కోట్ల వ్యయంతో హాస్టల్ భవనాల మరమ్మతులు చేపట్టినట్లు చెప్పారు. ఎస్ఎస్సి విద్యార్థులకు ఆల్-ఇన్-వన్ గైడ్స్ అందజేసి, గత సంవత్సరం 99.5 శాతం ఉత్తీర్ణత సాధించగా, ఈ సంవత్సరం 100 శాతం ఫలితాల కోసం కృషి చేస్తున్నట్లు వెల్లడించారు.బీసీ స్టడీ సర్కిల్స్ ద్వారా గ్రూప్స్, యూపీఎస్సీ పరీక్షలకు కోచింగ్‌తో పాటు అవసరమైన అధ్యయన సామగ్రి అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి**

ఈ కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, జిల్లా సాంస్కృతిక సారథి కళాకారుల పాటలు ఆహూతులను ఆకట్టుకున్నాయి.

ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత సంతోష్, అదనపు కలెక్టర్ పాండు, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి జగదీష్, వివిధ శాఖల అధికారులు, కుల సంఘాల ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, యువత, విద్యార్థులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాయం కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ఖమ్మం, ఏప్రిల్ 11: బూర్గంపహాడ్ మండలంలో వినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా తాసీల్దార్ కార్యాలయంలో జరిగిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. తొలుత బూర్గంపహాడ్‌లోని రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కళాశాలలో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం స్కూల్ యాజమాన్యం పలు సమస్యలపై వినతిపత్రం అందజేయగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా బూర్గంపహాడ్ పంచాయతీ గౌతాపురంలో తల్లపురెడ్డి నాగేశ్వరి, నీరుడు రమణ లబ్ధిదారుల ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశంలో పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జమలారెడ్డి, తాసీల్దార్ కేఆర్‌కే ప్రసాద్, పంచాయతీరాజ్ డీఈ పొదెం వెంకటేశ్వర్లు, ఏఈ చారి, డీటీ సమ్మయ్య, మాజీ సొసైటీ అధ్యక్షుడు పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, లక్ష్మీపురం మాజీ ఉప సర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్ మందా నాగరాజు, ఉప సర్పంచ్ గుండె వెంకన్న, నాయకులు భజన సతీష్, ప్రసాద్, కైపు శ్రీనివాసరెడ్డి, దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, చిప్పా రాజు, ఇంగువ రమేష్, గుద్దేటి ప్రవీణ్, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, చల్లా వెంకటరమణ, బర్ల నాగమణి, ఎడమకంటి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌తో జీవన్ రెడ్డి చేతులు కలపడం బాధాకరం: మహేశ్ కుమార్ గౌడ్



ములుగు, ఏప్రిల్ 11 : కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరి మాజీ మంత్రి జీవన్ రెడ్డి తప్పుచేశారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు. ఇన్నాళ్లూ తమకంటే ఎక్కువగా బీఆర్ఎస్ అవినీతిపై మాట్లాడిన ఆయన ఆ పార్టీతో చేతులు కలపడం బాధాకరమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ముక్కలైందని.. ఆస్తుల కోసం కొట్టుకుంటున్నారని విమర్శించారు. బీజేపీకి తెలంగాణలో ఆదరణ లేదని అన్నారు. ఈరోజు(శనివారం) ములుగు జిల్లాలో మహేశ్ కుమార్ గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

ఉన్నఫలంగా ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ 100స్థానాల్లో గెలుస్తుందని మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. దశా, దిశా లేకుండా పదేళ్లు కేసీఆర్ పరిపాలన చేశారని, రూ. 8 లక్షల కోట్ల అప్పు చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తమ ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని తెలిపారు. కాంట్రాక్టర్లు ఇచ్చే డబ్బులతో జేబులు నింపుకోవడంతోనే కాళేశ్వరం కూలిపోయిందని మహేశ్ కుమార్ గౌడ్ విమర్శలు చేశారు.

# ఆపరేషన్ "వజ్రప్రహార్" లో భాగంగా కార్డన్ అండ్ సర్చ్ నిర్వహణ



అమరావతి, ఏప్రిల్ 11:రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఆదేశముల మేరకు ఈగల్ చీఫ్ ఆకే రవి కృష్ణ, పర్యవేక్షణలో, జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఉత్తర్వుల మేరకు ఆత్మకూరు సబ్ డివిజన్ డీస్పీ రామంజి నాయక్ ఆద్వర్యంలో శనివారం మాదకద్రవ్యాల నియంత్రణకు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఆపరేషన్ వజ్రప్రహార్ లో భాగంగా అమలాపురం,కృష్ణపురం మొదలగు ప్రాంతాలలో పోలీసు సిబ్బందితో నేడు కార్డన్ సెర్చ్ ఆపరేషన్ విస్తృతంగా నిర్వహించరు.

డి ఎస్ పి మాట్లాడుతూ నేరగాళ్ల కదలికలను కనిపెట్టేందుకు, మారుమూల ప్రాంతాలను తనిఖీ చేసేందుకు ఈ ఆపరేషన్ నిర్వహించడం జరిగిందన్నారు. అనుమానితులు ,నేరచరిత్ర గలవారి ఇళ్ళలో తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా మాదకద్రవ్యాల వినియోగం జరుగుతున్నట్లు అనుమానం ఉన్న ప్రాంతాలు, అద్దె ఇళ్లు, ఖాళీ భవనాలు, ఇతర అనుమానాస్పద ప్రదేశాలలో పోలీసులు సోదాలు నిర్వహించామన్నారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీట్లు ఉన్న వ్యక్తులను పిలిపించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించి వారికి సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు.

అనంతరం ప్రజలతో సమావేశం నిర్వహించి నేర నియంత్రణకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, చట్టపరమైన దుష్పరిణామాల గురించి అవగాహన కల్పించారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, కుటుంబ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే ఏపీ, ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

సమాచారం ఇచ్చే వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజలతో కలిసి "ఆపరేషన్ వజ్రప్రహార్ ప్రతిజ్ఞ" నిర్వహించి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడాలని ప్రతిజ్ఞ చేశారు. సమాజాన్ని డ్రగ్స్ రహితంగా మార్చడంలో ప్రజల సహకారం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు. కార్యాక్రమంలో ఆత్మకూరు టౌన్, రూరల్ ఇన్స్పెక్టర్లు మహేశ్వర్ రెడ్డి, సురేశ్ కుమార్ రెడ్డి, నారాయణ రెడ్డి పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# బహ్రెయిన్ పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గౌరవ అబ్దుల్లా బిన్ అడెల్ ఫఖ్రోతో సమావేశమైన భారత వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 11: బహ్రెయిన్ పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గౌరవ శ్రీ అబ్దుల్లా బిన్ అడెల్ ఫఖ్రోతో... భారత వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ ఈ రోజు వీడియో అనుసంధానం ద్వారా సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా, శ్రీ గోయల్ ఈ ప్రాంతానికి ప్రకటించిన కాల్పుల విరమణను స్వాగతించారు. కాల్పుల విరమణ శాశ్వతంగా కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఘర్షణల వల్ల తలెత్తిన ఇబ్బందుల నుంచి బహ్రెయిన్ సహా ఈ ప్రాంతంలోని దేశాలు త్వరగా కోలుకుంటాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో నౌకా వాణిజ్యం, ఇతర మార్గాల ద్వారా అంచనా వేసిన వాణిజ్య కార్యకలాపాలు పూర్తి స్థాయిలో కొనసాగేలా చూడాల్సిన అవసరాన్ని శ్రీ గోయల్ ప్రధానంగా ప్రస్తావించారు.

బహ్రెయిన్‌కు భారత్ తరపున పూర్తి సంఘీభావం తెలుపుతూ... ఆ దేశంలోని కీలక సంస్థలపై ఇటీవల జరిగిన దాడులను కేంద్ర మంత్రి ఖండించారు. నౌకా వాణిజ్య భద్రత సహా ఆ దేశ భద్రత, స్థిరత్వానికి మద్దతును పునరుద్ఘాటించారు.

భారతీయ పౌరులకు బహ్రెయిన్ అందించిన మద్దతును శ్రీ గోయల్ అభినందించారు. భారతీయ పౌరుల క్షేమం కోసం కృషి చేసిన బహ్రెయిన్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

నిరంతర సహకారం, సన్నిహిత భాగస్వామ్యం ద్వారా భారత్-బహ్రెయిన్ ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలనే ఉమ్మడి నిబద్ధతను ఈ సమావేశం పునరుద్ఘాటించింది.

# గల్ఫ్ సహకార మండలి (జీసీసీ) సెక్రటరీ జనరల్ జాసెమ్ మొహమ్మద్ అల్ బుదైవీతో కేంద్ర వాణిజ్య-పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ సమావేశం

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 11:కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ ఈ రోజు గల్ఫ్ సహకార మండలి (జీసీసీ) సెక్రటరీ జనరల్ గౌరవనీయ జాసెమ్ మొహమ్మద్ అల్ బుదైవీతో ఆన్‌లైన్ ద్వారా సంభాషించారు.

గల్ఫ్ ప్రాంతంలో ఇటీవల ప్రకటితమైన కాల్పుల విరమణ శాశ్వతం కావాలని, సుదీర్ఘ శాంతి-స్థిరత్వాలకు ఇది మార్గం సుగమం చేస్తుందని ఈ సందర్భంగా శ్రీ గోయల్ ఆశాభావం వ్యక్తం చేశారు. పరస్పర చర్చలతోనే విభేదాలను ద్వారా పరిష్కరించుకోగలమనే భారత్ సూత్రబద్ధ వైఖరిని ఆయన పునరుద్ఘాటించారు.

భారత్, జీసీసీల మధ్యగల బలమైన ప్రజా సంబంధాలే ఈ ప్రాంత దేశాలతో శక్తిమంతమైన ఆర్థిక, వాణిజ్య సంబంధాలకు మూలమని మంత్రి గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో ఒక మైక్య శక్తిగా జీసీసీ తన వంతు పాత్రను కొనసాగించగలదని ఆయన ఆశాభావం వెలిబుచ్చారు. జీసీసీ దేశాలకు భారత్ సంఘీభావం తెలుపుతున్నదని తెలిపారు. అలాగే, నిత్యావసర ఆహార పదార్థాల సరఫరా శ్రేణిలో ఎదురయ్యే సవాళ్ల పరిష్కారంలో భారత్ మద్దతును పునరుద్ఘాటించారు. లాజిస్టిక్స్ బలోపేతం, స్థిరత్వ పరిరక్షణ దిశగా ప్రత్యామ్నాయ మార్గాన్వేషణకు జీసీసీ చేపట్టిన చర్యలను ఆయన అభినందించారు.

ఈ ప్రాంతంలో వాణిజ్య కార్యలాపాలు సజావుగా సాగిపోయేలా భరోసా ఇవ్వడంలో సమన్వయం సహిత కృషి ఆవశ్యకతను ఉభయపక్షాలూ అంగీకరంచాయి. మొత్తం మీద సహకారం పరస్పర మద్దతు స్ఫూర్తితో భారత్-జీసీసీ ఆర్థిక భాగస్వామ్యం మరింత బలోపేతం చేయడంలో ఉమ్మడి నిబద్ధతను ఈ సమావేశం పునరుద్ఘాటించింది.

# ఖతార్‌లోని దోహాలో కేంద్రమంత్రి శ్రీ హర్‌దీప్ సింగ్ పూరి పర్యటన

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 11:రెండు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం పెట్రోలియం, సహజ వాయువుల శాఖ గౌరవ మంత్రి శ్రీ హర్‌దీప్ సింగ్ పూరి ఏప్రిల్ 9వ తేదీన మధ్యాహ్నం దోహాకు చేరుకున్నారు. సాయంత్రం ఖతార్ ఇంధన వ్యవహారాల శాఖ సహాయమంత్రి, ఖతార్ ఎనర్జీ ప్రెసిడెంట్, సీఈఓ గౌరవ సాద్ షెరిదా అల్-కాబీతో సమావేశమయ్యారు.

ఖతార్ అమీర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్ థానీకి, ఖతార్ ప్రధానమంత్రి, విదేశాంగ మంత్రి గౌరవ షేక్ మహమ్మద్ బిన్ అబ్దుల్ రెహమన్ అల్ థానీకి భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ తరపున సందేశాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు.

మార్చి 2026లో యుద్ధం ప్రారంభమైన తర్వాత పీఎం మోదీ, గౌరవ అమీర్ మధ్య జరిగిన రెండు ఫోన్ సంభాషణలను గుర్తు చేసుకున్నారు. శాంతి, స్థిరత్వాన్ని పునరుద్ధరించటానికి చర్చలు, దౌత్య మార్గాల ప్రాముఖ్యతను ఇరువురు నేతలు స్పష్టం చేశారు. ఖతార్ లోని భారత సమాజం పట్ల చూపిన ఆదరణ, అందించిన మద్దతుకు గానూ గౌరవ అమీర్‌కు పీఎం మోదీ కృతజ్ఞతలు తెలిపారు.

ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలకు సంబంధించిన అన్ని అంశాలపై ఇరుదేశాల మంత్రులు చర్చించారు. ఇందులో ఉన్నతస్థాయి చర్చలు, వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం, సంస్కృతి, ప్రజల మధ్య సంబంధాల వంటి అంశాలున్నాయి. త్వరలో పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం నెలకొంటాయని.. భారత్, ఖతార్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని కాంక్షించారు.

విశ్వసనీయ ఇంధన సరఫరాదారుగా కొనసాగేందుకు ఖతార్ కట్టుబడి ఉందని, భారత్‌తో ఇంధన సంబంధాలను, సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని గౌరవ మంత్రి సాద్ షెరీదా అల్-కాబీ స్పష్టం చేశారు.

ఏప్రిల్ 8న రెండు వారాల కాల్పుల విరమణకు అంగీకారం తెలపటాన్ని ఇరువురు మంత్రులు స్వాగతించారు. ప్రపంచ ఇంధన సరఫరాలో అంతరాయానికి ముగింపు పలికి, సాధారణ పరిస్థితులను పునరుద్ధరించాల్సిన ఆవశ్యకతను స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ప్రపంచ సరఫరా వ్యవస్థలను కాపాడేందుకు నిరంతర నౌకాయాన స్వేచ్ఛ, అంతర్జాతీయ వాణిజ్య ప్రవాహం అవసరమని తెలిపారు.

తనకు ఆతిథ్యం ఇచ్చినందుకు ఖతార్ ఇంధన శాఖ సహాయమంత్రి గౌరవ సాద్ షెరీదా అల్-కాబీకి కేంద్రమంత్రి ధన్యవాదాలు తెలిపారు. రాబోయే వారాల్లో నిరంతరం అందుబాటులో ఉండాలని ఇరువురు మంత్రులు నిర్ణయించుకున్నారు.

# పూలే ఆశయాలే మా ఎజెండా

## -కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు



శ్రీకాకుళం, ఏప్రిల్ 11: జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన ఆశయాలను కూటమి సర్కారు ముందుకు తీసుకువెళ్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని పొన్నాడ బ్రిడ్జి కూడలి వద్ద జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి కేంద్రమంత్రి నివాళులర్పించారు. జ్యోతిరావు పూలే కేవలం ఒక ప్రాంతానికి, ఒక దేశానికి చెందిన వ్యక్తి కాదని.. ఆయన ఆశయాలు రెండు శతాబ్దాలుగా ప్రపంచానికి ఆధారంగా నిలుస్తున్నాయని అన్నారు.

సమాజంలో సమానత్వానికి, వెనుకబడిన తరగతుల్లో విద్య ద్వారా మార్పు కోసం ఆయన చేసిన కృషి నేటి సమాజానికి ఆదర్శం అని అన్నారు. మహిళల పాఠశాలను ఆనాడే ఏర్పాటు చేసి వారి అభ్యున్నతికి పాటుపడ్డారానికి తెలిపారు. అనాడు ఎన్టీఆర్, నేడు చంద్రబాబు నాయుడు.. పూలే ఆశయాలను కొనసాగిస్తూ ఉన్నారని అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ అజెండా పూలే ఆశయాలే అని స్పష్టం చేశారు. అన్ని కులాలకు కార్పొరేషన్ ద్వారా తోడ్పాటు అందిస్తున్నట్టు స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ ఒక బీసీ అవ్వడం మనందరి అదృష్టం అని రామ్మోహన్ నాయుడు అన్నారు. ఎన్.సి.బి.సి నేషనల్ కమిషన్ ను పార్లమెంట్ లో పాస్ చేయించి చట్టబద్ధత కల్పించడం ఎన్డీయే సర్కారు నిబద్ధతకు నిదర్శనం అని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ప్రజా సంఘాల ప్రతినిధులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతతోనే మహాత్మా పూలేకు నిజమైన నివాళి..

## -జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం, ఏప్రిల్ 11: సామాజిక సమానత్వం కోసం పరితపించిన మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని మహిళలు విద్యావంతులు కావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలో బీసీ భవన్ లో నిర్వహించిన పూలే 199 జయంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. నాడు సావిత్రిబాయి పూలేకు చదువు నేర్పి, ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్ది దేశంలోనే తొలి బాలికల పాఠశాలను స్థాపించిన ఘనత పూలే దంపతులకే దక్కుతుందని కొనియాడారు.

సభలో మహిళల భాగస్వామ్యం అధికంగా ఉండటం శుభపరిణామమని పేర్కొన్న కలెక్టర్.. స్థానిక భవనానికి15,000 విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు కలెక్టర్ నిధుల నుంచి తక్షణమే చర్యలు తీసుకుంటామని, భవిష్యత్తులో ఈ భవనాన్ని ప్రజోపయోగ కార్యక్రమాలకు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక శాసనసభ్యులు గొండు శంకర్ మాట్లాడుతూ,విద్యావంతులైన సమాజమే పూలేకు దక్కే అసలైన గౌరవమని, ఆ దిశగా కూటమి ప్రభుత్వం బీసీల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు.

బీసీ సబ్‌ప్లాన్‌కు 15,000 కోట్ల రూపాయిలు కేటాయించామని, కూటమి ప్రభుత్వం బీసీల కోసం 1000 కోట్లతో ఆదరణ పథకాన్ని త్వరలో పునఃప్రారంభించనున్నట్లు తెలిపారు. మత్స్యకారుల ప్రయోజనాల దృష్ట్యా వివాదాస్పద జీవో 217ను రద్దు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం జ్యోతిబా పూలే పాఠశాలలను 10+2 స్థాయికి పెంచామని, వసతి గృహాల్లో సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే వివరించారు.

దీనిలో భాగంగా 17.5 కోట్ల రూపాయిలతో హాస్టళ్లలో వాటర్ ప్లాంట్ల ఏర్పాటు పనులు చేపట్టామని తెలిపారు. సమ సమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలన్న పూలే సిద్ధాంతానికి అనుగుణంగా ప్రభుత్వం విద్యా రంగాన్ని బలోపేతం చేస్తోందని తెలిపారు

# శతాబ్ది వేడుకల సందడి

## -ఏప్రిల్ 14న 'స్వరనీరాజనం' సంగీత విభావరి

## -యువతలో దేశభక్తి జ్వాల రగిల్చే లక్ష్యంతో ప్రత్యేక కార్యక్రమం



కర్నూలు, ఏప్రిల్ 11: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది వేడుకల సందర్భంగా కర్నూలు జిల్లాలో తొలిసారిగా "స్వరనీరాజనం" పేరుతో సంఘ గీతాలాపన సంగీత విభావరి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా యువతలో దేశభక్తి భావనను పెంపొందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. శనివారం నగరంలోని శ్రీ సిద్ధిబుద్ధి సమేత శ్రీ వినాయక స్వామి మందిర సమావేశ మందిరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రముఖ న్యాయవాది ముద్దనూరు శ్రీధర్ మాట్లాడుతూ, 1925 నుంచి ప్రారంభమైన సంఘ ప్రస్థానంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదురైనా, దేశభక్తి గీతాలు సంస్థకు నూతన ఉత్సాహాన్ని నింపాయని పేర్కొన్నారు. ఆ గీతాల సారాన్ని ప్రజలకు పరిచయం చేసే ఉద్దేశంతో ఈ "స్వరనీరాజనం" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. సంస్థ ఉపాధ్యక్షులు మాకం నాగరాజు మాట్లాడుతూ, సంఘ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా సంస్కృత భారతి, కర్నూలు విభాగం ఆధ్వర్యంలో ఈనెల 14న (డా. బీఆర్ అంబేద్కర్ జయంతి రోజు) సాయంత్రం 5.30 గంటలకు బి.క్యాంప్‌లోని శ్రీ టీ.జీ. లక్ష్మి వెంకటేశ్వర కళ్యాణ మండపం, ఆఫీసర్స్ క్లబ్ ప్రాంగణంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈ సంగీత విభావరిలో సంఘ గీతాల ప్రత్యేక ప్రదర్శనతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకోనున్నాయని నిర్వాహకులు తెలిపారు. యువత, విద్యార్థులకు సంఘ భావజాలం, దేశభక్తి విలువలను పరిచయం చేయడంలో ఈ కార్యక్రమం కీలకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ పి. విశ్వనాథ్ ముఖ్య అతిథిగా హాజరవుతుండగా, ప్రముఖ న్యూరో ఫిజీషియన్ డా. నరసరాం విశిష్ట అతిథిగా పాల్గొననున్నారు.

అఖిల భారత ధర్మ జాగరణ సహ ప్రముఖ్ ఏలే శ్యాం కుమార్ ప్రధాన వక్తగా ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని నిర్వాహకులు విడుదల చేశారు. జిల్లాలోని ప్రజలు, ముఖ్యంగా యువత, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యం.డీ.వై. రామశర్మ, సందడి మహేశ్వర్, మాళిగి భాను ప్రకాష్, బిలకంటి మురళి తదితరులు పాల్గొన్నారు.

# శ్లోక ది స్కూల్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



సంగారెడ్డి, ఏప్రిల్ 11: సంగారెడ్డి పట్టణంలోని బైపాస్ రోడ్‌లో ఉన్న శ్లోక ది స్కూల్‌లో విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ పుల్లూరి ప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ వైద్యులు, సర్జన్ డా.కోనేటి శ్రీధర్ మాట్లాడుతూ.. గ్రాడ్యుయేషన్ డే నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో ఉత్సాహం పెరుగుతుందని అన్నారు. విద్యార్థులు చురుకుగా పాల్గొని భగవద్గీత శ్లోకాలను పారాయణం చేయడం ప్రశంసనీయమని అభిప్రాయపడ్డారు.

స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ డి.అసన్ మాట్లాడుతూ శ్లోక ది స్కూల్ విద్యార్థులు విద్యలోనే కాకుండా కళారంగాల్లో కూడా ప్రతిభ చూపుతున్నారని తెలిపారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న సంగారెడ్డి మున్సిపాలిటీ 33వ వార్డ్ కౌన్సిలర్ విస్లావత్ రవీందర్ మాట్లాడుతూ స్వల్ప కాలంలోనే స్కూల్ మంచి అభివృద్ధి సాధించి విద్యార్థులను సమగ్రంగా తీర్చిదిద్దుతున్నదని కొనియాడారు.

ఇస్కాన్ సంస్థ మేనేజర్ విభీషణ్ దాస్ మాట్లాడుతూ విద్యార్థులు భగవద్గీత శ్లోకాల పఠనంలో నైపుణ్యం ప్రదర్శించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ పవిత్ర రెడ్డి, చందనరెడ్డి, శ్వేతా పల్లె, నీమ, వైశాలి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలు నేటికీ మార్గదర్శకం

నల్గొండ, ఏప్రిల్ 11: మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో ప్రముఖ సామాజిక కార్యకర్త గుజ్జుల గౌరీశ్వర నాయుడు సి.పి.ఐ. ఎమ్.ఎల్. లిబరేషన్ పార్టీ జనరల్ సెక్రటరీ వి.క్కిలి వెంకటేశ్వర్లు పాల్గొని పూలే విగ్రహానికి పూలమాలలు నివాళులర్పించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూలే భారతదేశంలో సామాజిక చైతన్యానికి నాంది పలికిన మహోన్నత సంస్కర్త అని కొనియాడారు.

కులవివక్ష, అన్యాయాలకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటం నేటికీ సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. 1827 ఏప్రిల్ 11న మహారాష్ట్రలో జన్మించిన పూలే తన జీవితమంతా అణగారిన వర్గాల అభ్యున్నతికి అంకితం చేసి విద్య



ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని నమ్మి 1848లో బాలికల కోసం తొలి పాఠశాలను స్థాపించడం ద్వారా విద్యా విప్లవానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. మహిళల అభివృద్ధి లేకుండా సమాజం ఎదగదని విశ్వసించిన పూలే బాల్య వివాహాలకు వ్యతిరేకంగా, వితంతు పునర్వివాహాలకు మద్దతుగా ఉద్యమించి సమాజంలో మార్పుకు నాంది పలికారని, మహిళల హక్కుల పరిరక్షణలో ఆయన పాత్ర అమోఘమని కొనియాడారు.

1873లో స్థాపించిన సత్యశోధక సమాజం ద్వారా కులమత భేదాలు లేకుండా అందరికీ సమాన హక్కులు కల్పించేందుకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని, ఆయన రచనలు సమాజంలో చైతన్యాన్ని రగిలించాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సి.పి.ఐ. ఎమ్.ఎల్. లిబరేషన్ పార్టీ నాయకులు నరసింహులు యేసన్న బీబీ మూర్తుజాబీ తదితరులు, స్థానిక నాయకులు, సామాజిక కార్యకర్తలు, మహిళలు, యువకులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా పూలే 200వ జయంతి వేడుకలు ప్రారంభం

న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 11:నేడు మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయనకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఘన నివాళులు అర్పించారు. పూలేను ఒక దార్శనిక సామాజిక సంస్కర్తగా అభివర్ణించిన ప్రధాని.. ఆయన తన జీవితాన్ని సమానత్వం, న్యాయం, విద్య వంటి ఉన్నత ఆశయాల కోసమే అంకితం చేశారని కొనియాడారు.

మహిళలు, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడటంలో మహాత్మా పూలే ఒక మార్గదర్శిగా నిలిచారని ప్రధానమంత్రి పేర్కొన్నారు. తన నిరంతర కృషి ద్వారా విద్యను మహిళల సాధికారతకు ఒక శక్తిమంతమైన సాధనంగా మార్చడంలో ఆయన కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఈ సంవత్సరం ఆ మహనీయ సంస్కర్త 200వ జయంతి వేడుకలు ప్రారంభం కావడం అత్యంత విశేషమని అన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రధానమంత్రి ఒక ప్రత్యేక వ్యాసాన్ని కూడా రాశారు. మహాత్మా పూలే నేటికీ అనేక మందికి మార్గదర్శిగా నిలుస్తున్నారన్నారు. విద్య, అభ్యసనం, అందరి సంక్షేమం కోసం ఆయన ఇచ్చిన ప్రాధాన్యత నేటి కాలంలో ఎంతగానో ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయని తెలిపారు. సమాజ ప్రగతికి పూలే ఆలోచనలు మనందరికీ నిరంతరం దిశానిర్దేశం చేయాలని శ్రీ మోదీ ఆకాంక్షించారు.

సామాజిక మాధ్యమం ఎక్స్ లో ప్రధానమంత్రి ఈ విధంగా పేర్కొన్నారు.

"మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా.. సమానత్వం, న్యాయం, విద్య అనే ఆదర్శాల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ఆ దార్శనిక సంఘ సంస్కర్తకు ఘన నివాళులర్పిస్తున్నాను. మహిళలు, అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణలో ఆయన ఒక మార్గదర్శిగా నిలిచారు. ఆయన చేసిన కృషి ఫలితంగా విద్య సాధికారతకు ఒక శక్తిమంతమైన సాధనంగా రూపుదిద్దుకుంది. ఈ సంవత్సరం ఆయన 200వ జయంతి ఉత్సవాల ప్రారంభాన్ని మనం జరుపుకుంటున్నాం. సామాజిక ప్రగతి దిశగా సాగే ప్రస్థానంలో ఆయన ఆలోచనలు ప్రతి ఒక్కరికీ నిరంతరం దిశానిర్దేశం చేస్తూ ఉండాలని కోరుకుంటున్నాను."

మహాత్మా ఫూలే 200వ జయంతి ఉత్సవాలు ప్రారంభమవుతున్న ఈ తరుణంలో.. ఆయన ఎందరో వ్యక్తులకు ఏ విధంగా మార్గదర్శిగా నిలుస్తున్నారు, విద్య, అభ్యాసనం, సర్వజన సంక్షేమంపై ఆయన కనబరిచిన ప్రాధాన్యత నేటి యుగానికి ఎంతటి సంబంధం కలిగి ఉన్నాయనే అంశాలపై నా భావాలను వ్యాసంలో రాశాను."

గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా ఫూలే 200వ జయంతి ఉత్సవాలు ప్రారంభమవుతున్నాయి. ఆయన తన జీవితమంతా విద్య, జ్ఞానం, ప్రజా సంక్షేమానికి అంకితం చేశారు. నేటికీ కోట్లాది దేశవాసులకు ఆయన ఎలా స్ఫూర్తిగా నిలిచారనే విషయాలపై నా ఆలోచనలను ఈ వ్యాసంలో పొందుపరిచాను."

# జన గణన ఎన్యుమరేటర్లుగా గిరిజన ఉపాధ్యాయులను నియమించాలి

**-జిల్లా కలెక్టర్‌కు ఎస్టియు సంఘ నాయకుల వినతి**



ఆదిలాబాద్, ఏప్రిల్ 11:ప్రభుత్వపరంగా చేపట్టే జన గణన 2026 కార్యక్రమంలో ఉట్నూర్ ఐటిడిఏ పరిధిలో పనిచేస్తున్న గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులను ఎన్యుమరేటర్లుగా,సూపర్ వైజర్లుగా నియమించాలని కోరుతూ శనివారం అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిష కు కలిసి విన్నవించినట్లు అదిలాబాద్ ఎస్టియు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మూగ శ్రీనివాస్, జాదవ్ రవికుమార్ లు తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులకు అవకాశం కల్పించకపోవడం సూచనియమని వారికి కూడ ఎయిర్టెల్ గా నియమించాలని కలెక్టర్ కు విన్నవించినట్లు వారు తెలిపారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జన గణన విధుల నిర్వహణ కోసం సూపర్ వైజర్లుగా, ఎన్యుమరేటర్లుగా చాలా మండలాలలో గిరిజన సంక్షేమశాఖఉపాధ్యాయులను ఎంపిక చేయలేదని అన్నారు. ఎన్నికల విధుల నిర్వహణలోగాని, జిల్లా విద్యాశాఖ నిర్వహించే విద్యాసంబద కార్యక్రమాల నిర్వహణ లో గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల సేవలు మరువలేనివని అన్నారు.కాని ప్రస్తుతం జన గణన విధుల నిర్వహణ బాధ్యతలకు గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులను ఎంపిక చేయకపోవడం విడ్డూరంగా ఉందని వెంటనే అన్ని మండలాల్లో జన గణన విధుల నిర్వహణ కు ఎన్యుమరేటర్లుగా, సూపర్ వైజర్లుగా గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులను కూడా నియమించాలని కలెక్టర్ కు కోరినట్లు తెలిపారు.

# తిరుమల, తిరుపతి దేవస్థానానికి రూ.30 లక్షలు విరాళం



తిరుపతి, ఏప్రిల్ 11: తిరుమల, తిరుపతి దేవస్థానానికి ఇద్దరు భక్తులు రూ.30 లక్షలు వివిధ సంస్థలకు విరాళాలు అందించారు . కదిరికి చెందిన సిద్ధిసాయి రైస్ మిల్ యజమాని కె.వెంకటేష్ శనివారం టీటీడీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టు కు రూ.10 లక్షలు, గోసంరక్షణ ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందించారు.

ఈ మేరకు దాత తిరుమలలోని టీటీడీ చైర్మన్ క్యాంపు కార్యాలయంలో చైర్మన్ బీ.ఆర్.నాయుడుకు విరాళం డీడీలను అందజేశారు. అదేవిధంగా తిరుపతికి చెందిన లక్కీ4యూ ఎగ్జిమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు రూ.10,01,116 విరాళంగా అందించారు. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధులు తిరుమలలోని టీటీడీ అదనపు ఈవో క్యాంపు కార్యాలయంలో అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి విరాళం డీడీని అందజేశారు.

# పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి

నల్గొండ, ఏప్రిల్ 11: సామాజిక తత్వవేత్త మహాత్మా జ్యోతిబా పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని నిడమనూరు మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం అన్నారు. జ్యోతి రావు పూలే 200వ జయంతి సందర్భంగా మార్కెట్ కమిటీ కార్యాలయంలో శనివారం పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామజిక చైతన్యం కోసం పూలే చేసిన సేవలు ఆదర్శమన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి తోట చందర్ రావు, నాయకులు కొండా శ్రీనివాస్ రెడ్డి, శేషరాజు శ్రీనివాస్, విశ్వనాధుల రమేశ్, మెరుగు మధు, శేషరాజు లక్ష్మినరేష్ దాసు, మేరెడ్డి వెంకటరమణ, మన్నెం శంకర్, కామ్మాల శ్రీను, గాయకవాడ లక్ష్మినారాయణ, మోర శంకర్ పాల్గొన్నారు.

# వైద్యం వికటించి మహిళ మృతి..

హైదరాబాద్, ఏప్రిల్ 11: వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. ఈ సంఘటన కుటుంబ సభ్యుల్లో తీవ్ర విషాదాన్ని కలిగించింది.

కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం దారూర్ మండలం కెరెల్లి గ్రామానికి చెందిన కొత్తకాపు లత (38), భర్త అనంతరెడ్డి, వారం రోజుల క్రితం ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రిని సంప్రదించారు. వైద్య పరీక్షల్లో గర్భాశయంలో సమస్య ఉందని వైద్యులు గుర్తించి, అదే ఆస్పత్రిలో శస్త్రచికిత్స నిర్వహించారు.

చికిత్స అనంతరం శనివారం డిశ్చార్జ్ కావాల్సి ఉండగా, ఆకస్మికంగా ఆమె ఆరోగ్యం విషమించి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగిన కుటుంబ సభ్యులను పోలీసులు సమాధానపరిచారు.

సమాచారం అందుకున్న టౌన్ సీఐ రఘుకుమార్ ఘటన స్థలానికి చేరుకుని వైద్యులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఆపరేషన్ అనంతరం మృతికి గల కారణాలపై విచారణ కొనసాగుతోందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# సామాజిక సంస్కరణవాది జ్యోతిరావు పూలే : వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి

హనుమకొండ ఏప్రిల్ 11: సామాజిక సంస్కరణవాది జ్యోతిరావు ఫూలే అని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. కేయూ దూరవిద్య కేంద్ర ప్రాంగణంలోని పూలే విగ్రహాల వద్ద మహాత్మా జ్యోతిబాపూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ వల్లూరి రాంచంద్రంతో కలిసి పూలే విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు.

వీసీ మాట్లాడుతూ సమాజంలో ఉన్న రుగ్మతలు రూపుమాపడానికి విద్యనే ఏకైక సాధనమని నమ్మి, నిమ్నవర్గాలకు ముఖ్యంగా మహిళలకు విద్యను అందించడం వల్ల సమాజంలో మార్పు వస్తుందని తెలిపారు. రిజిస్ట్రార్ రామచంద్రం మాట్లాడుతూ పూలే ఆశయాలను కొనసాగించాలని తెలిపారు.

ఓఎస్డీ వెంకటరామిరెడ్డి, పాలకమండలి సభ్యులు బి.సురేష్‌లాల్, బి.రమ, అనితారెడ్డి, చిరరాజు, క్యాంపస్ ప్రిన్సిపాల్ మనోహర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ, హాస్టల్ సంచాలకులు శ్రీనివాస్, విభాగాధిపతులు, ఆర్ట్స్- కాలేజీ ప్రిన్సిపల్ సుంకరి జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతకు షీనేత్ర

హైదరాబాద్, ఏప్రిల్ 11:మహిళల ఆత్మగౌరవానికి, వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించే రహస్య కెమెరాల గుట్టురట్టు చేసేందుకు హైదరాబాద్ పోలీసు విభాగం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసింది. హోటళ్లు, మాల్స్, హాస్టళ్లు, విద్యాసంస్థలతో పాటు వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో నిఘా కెమెరాల ముప్పు నుంచి రక్షణ కల్పించేందుకు షీనేత్ర టీమ్స్‌ను ఏర్పాటు చేసింది. శుక్రవారం బషీర్‌బాగ్‌లోని పాత కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ ఈ ప్రత్యేక బృందాలకు కెమెరా డిటెక్టర్ పరికరాలను అందించారు.నగర కమిషనరేట్ పరిధిలోని ఏడు జోన్లకు ఒక్కోబృందం చొప్పున మొత్తం ఏడు షీ నేత్ర ప్రత్యేక టీమ్‌లను రంగంలోకి దింపింది. ఈ బృందాలకు అత్యాధునిక కెమెరా డిటెక్టర్ల వినియోగం, తనిఖీల సమయంలో పాటించాల్సిన నిబంధనలపై ఎస్‌వోపీపై రెండు దశల్లో పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ షాపింగ్ మాల్స్‌లోని ట్రయల్‌రూమ్‌లు, ఆసుపత్రులు, హోటళ్లు, హాస్టళ్లలో రహస్య కెమెరాలు అమర్చి మహిళల గోప్యతకు భంగం కలిగించే ఘటనలపై ఉక్కుపాదం మోపుతామన్నారు.సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి ఈ ఏడు బృందాల ద్వారా నగరవ్యాప్తంగా ముమ్మురంగా తనిఖీలు చేపడతామని తెలిపారు. తమ ప్రాంగణాల్లోని ప్రైవేటు ప్రదేశాల్లో రహస్య కెమెరాలు లేవని నిర్ధారించుకోవలసిన పూర్తి బాధ్యత ఆయా యాజమాన్యాలదేనన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని, అజాగ్రత్త ఉన్నా లేదా కెమెరాలు లభ్యమైనా సంబంధిత యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# దీర్ఘకాల భూ సమస్యలకు పరిష్కారం..

**-ముఖ్యమంత్రి ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా జిల్లా లో పారదర్శకంగా డీ నోటీ ఫికేషన్ ప్రక్రియ..**

**-111 మంది రైతులకు డీ-నోటిఫై పత్రాలు**

**-చుక్కల భూములు, 22ఏ భూముల సమస్యలకు క్లియర్ గ్రీన్ సిగ్నల్**

**-మీ భూమి మీ హక్కు లక్ష్యం సాధన**

**-జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా రైతులకు పత్రాలు పంపిణీ**



అమరావతి, ఏప్రిల్ 11: ఉమ్మడి కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలో కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న చుక్కల భూములు, 22ఏ-1 నిషేధిత జాబితా భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తూ 111 మంది రైతులకు డీ-నోటిఫికేషన్ క్లియరెన్స్ పత్రాలను అందజేసినట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు.

శనివారం కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ హాల్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి రైతులకు పత్రాలను పంపిణీ చేశారు. జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, డిఆర్ఓ రాము నాయక్, ఆర్డీఓలు, మండల తాసిల్దార్లు, రైతులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చుక్కల భూములు, 22 ఏ1 భూములు నిషేధిత జాబితాలో వుండి దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించి 111 మంది రైతులకు డీనోటిఫై చేసిన క్లియరెన్స్ పత్రాలు అందజేస్తున్నామన్నారు. జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమానికి సుమారు 400 మంది ప్రజలు హాజరవుతుండగా, అందులో 90 శాతం సమస్యలు భూములకు సంబంధించినవేనని తెలిపారు. ముఖ్యంగా ఆన్‌లైన్ రికార్డుల్లో పేర్లు నమోదు కాకపోవడం, తప్పుగా ఇతరుల పేర్లు నమోదు కావడం వంటి సమస్యలు ఎక్కువగా ఉన్నాయన్నారు.

తహసీల్దార్‌లు రికార్డింగ్ అధికారులుగా మాత్రమే వ్యవహరిస్తారని, భూమి యాజమాన్యాన్ని నిర్ణయించే అధికారం వారికి లేదని స్పష్టం చేశారు.

నమోదైన డాక్యుమెంట్లు, భూమిపై ఉన్న అనుభవం పొజెషన్ ఆధారంగా నిజమైన హక్కుదారుల పేర్లను రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయడం వారి బాధ్యత అని తాహసిల్దార్లకు వివరించారు. జిల్లాలో భూవివాదాలకు ప్రధాన కారణాలు కుటుంబ తగాదాలు, ప్రభుత్వ భూములపై అక్రమ క్రయవిక్రయాలు అని కలెక్టర్ పేర్కొన్నారు.

అసైన్డ్ భూములను అక్రమంగా కొనుగోలు చేయడం, అమ్మడం వంటి చర్యలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందన్నారు. ఇప్పటికే బనగానపల్లి పరిధిలో జరిగిన ఇలాంటి అక్రమ విక్రయాలను రద్దు చేసినట్లు తెలిపారు. వాగులు, వంకలు, చెరువులు వంటి ప్రకృతి వనరులు సామాజిక ఆస్తి అని, వాటిని ఆక్రమించకుండా సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. భవిష్యత్ తరాలకు మంచి వనరులు అందించాలంటే ఇవి రక్షించాల్సిన అవసరం ఉందన్నారు. రెవెన్యూ నిర్ణయాలపై అసంతృప్తి ఉన్న వారు తహసీల్దార్ స్థాయి తర్వాత ఆర్డీవోకు అప్పీల్ చేసుకోవచ్చని, అనంతరం జాయింట్ కలెక్టర్ వద్ద రివిజన్ పిటిషన్ వేయవచ్చని, చివరికి హైకోర్టును ఆశ్రయించే అవకాశమూ ఉందని తెలిపారు.

చుక్కల భూముల సమస్యకు చారిత్రక నేపథ్యం బ్రిటిష్ కాలంలో సర్వే సమయంలో పట్టాదారు వివరాలు లేని భూములకు 'చుక్కలు' గుర్తులు పెట్టడం వల్ల ఈ సమస్యలు ఉత్పన్నమయ్యాయని కలెక్టర్ వివరించారు. ఈ భూములను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం 2017లో డాటెడ్ ల్యాండ్స్ రెగ్యులరైజేషన్ చట్టాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. ఈ చట్టం ప్రకారం 2005కు ముందు నుంచి సాగులో ఉన్న లేదా అధీనంలో ఉన్న భూములను గుర్తించి అర్హులకు పట్టాదారు హక్కులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక కమిటీ ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తోందని వివరించారు.

జిల్లాలో సుమారు 150 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, అందులో 111 కేసులను పరిశీలించి ఆమోదించినట్లు తెలిపారు. మరో 280 ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ఒకే సర్వే నంబరులో ఉన్న భూములను సబ్‌డివిజన్ చేసి సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. మ్యుటేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తూ వీఆర్వో లాగిన్‌లో అప్లోడ్ అయిన దరఖాస్తులను తహసీల్దార్ స్థాయిలో త్వరితంగా పరిష్కరిస్తున్నామన్నారు.

మొత్తం 29 వేల ఎకరాలకు సంబంధించిన 26 వేల మంది పట్టాదారుల సమస్యలను పరిష్కరించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించి పెండింగ్ కేసులను క్లియర్ చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. కొన్ని దరఖాస్తులు వాగు పోరంబోకు భూములు ఆక్రమించడం, కోర్టు వివాదాలు ఉండడం వంటి కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు.

డీ-నోటిఫికేషన్ ప్రక్రియలో ఎవరైనా డబ్బులు అడిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పీజీఆర్ఎస్ ద్వారా ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. మొత్తం ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించిన తర్వాతే ఆదేశాలు జారీ చేస్తున్నామని స్పష్టం చేశారు. ఒక రైతు తన 49 ఎకరాల భూమి సమస్యను కేవలం 6 నెలల్లో పరిష్కరించుకున్నట్లు పేర్కొంటూ, సాధారణంగా సంవత్సరాలు పట్టే సమస్యలు త్వరితగతిన పరిష్కారం కావడం పట్ల సంతోషం వ్యక్తం చేసినట్లు తెలిపారు.

మిగిలిన కేసులను వచ్చే రెండు నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఖరీఫ్ సీజన్ నాటికి రైతులు తమ భూములపై పూర్తి హక్కులు పొందేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న రీ-సర్వే కార్యక్రమం ద్వారా ప్రతి రైతుకు "మీ భూమి ? మీ హక్కు" కింద స్పష్టమైన పత్రాలు అందజేయడం లక్ష్యమని పేర్కొన్నారు. పాస్ పుస్తకాలలో తప్పులు ఉంటే నవరణ మాడ్యూల్ ద్వారా సరిదిద్ది రైతులకు అందజేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం 111 మంది రైతులకు కలెక్టర్ చేతుల మీదుగా డీ-నోటిఫై పత్రాలు అందచేశారు. రైతులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు జిల్లా అధికారులకు భూ సమస్యల పరిష్కారం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# అంతరాష్ట్ర డీజిల్ దొంగల ముఠా అరెస్ట్

**-ఆరుగురు నిందితులు అరెస్ట్**

**- వెయ్యి లీటర్ల డీజిల్, రెండు డీసీఎంలు, ఆరు మొబైల్ ఫోన్లు, వడ్ల పట్టాలు స్వాధీనం**

**- కేసు వివరాలు వెల్లడించిన నల్లగొండ జిల్లా అదనపు ఎస్పీ జి.రమేశ్**

నల్గొండ, ఏప్రిల్ 11:అర్ధ రాత్రి ఆగి ఉన్న వాహనాలే లక్ష్యంగా డీజిల్ దొంగతనాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగల ముఠాను నల్లగొండ జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుండి 1000 లీటర్ల డీజిల్, రెండు ఆఅఓ వాహనాలు, 6 మొబైల్ ఫోన్లు, వడ్ల పట్టాలు (సుమారు రూ.40 లక్షల విలువ)




ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను ముడావత్ గాంధీ నాయక్(36), ముడావత్ వెంకటేశ్వర్లు నాయక్ (45), బనావత్ తుల్స్యా నాయక్ (21), ముడావత్ బాలకృష్ణ నాయక్(32), రామవత్ వాగ్య నాయక్(45), మరో మైనర్ బాలుడి గుర్తించారు. వీరంతా ఏపీలోని పల్నాడు జిల్లాకు చెందిన వారు. వీరంతా తెలుగు రాష్ట్రాల్లో 20కి పైగా డీజిల్ దొంగతనాల కేసుల్లో నిందితులుగా ఉన్నారు.

కేసు వివరాలను నల్లగొండ జిల్లా అదనపు ఎస్పీ జి.రమేశ్ శనివారం వెల్లడించారు. నల్లగొండ జిల్లా పరిధిలో జాతీయ రహదారులు, ఇతర హైవేలపై రాత్రి సమయంలో ఆగి ఉన్న లారీలు, ట్రక్కులు, ఇతర భారీ వాహనాల నుండి వరుసగా డీజిల్ దొంగతనాలు జరుగుతున్న ఘటనలు ఇటీవల ఎక్కువయ్యాయి. దీంతో జిల్లా ఎస్పీ ఆదేశానుసారం పోలీస్ సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి హైవేలు, అనుమానాస్పద ప్రాంతాల్లో గస్తీ పెంచడం జరిగింది. ఈ క్రమంలో ఈ నెల 10న రాత్రి సమయంలో చిట్యాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో హైవేపై అనుమానాస్పదంగా నిలిచి ఉన్న ఓ డీసీఎం వాహనాన్ని గమనించారు.

తనిఖీ చేయగా వడ్ల పట్టాల చాటున డీజిల్ తో నిండిన క్యాన్లు దాచి పెట్టినట్లు గుర్తించారు. వాహన డ్రైవర్ బాలకృష్ణ, ఇతరులను అదుపులోకి తీసుకుని విచారణ జరపగా హైవేపై ఆగి ఉన్న లారీల నుండి డీజిల్ దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు.

అలాగే తమ ముఠాకు చెందిన మరికొంత మంది సభ్యులు మరో డీసీఎం వాహనంతో కొంత దూరంలో ఉన్నట్లు సమాచారం ఇవ్వగా దీనిపై వెంటనే స్పందించి ఆ ప్రాంతంలో గాలింపు చేపట్టి రెండో డీసీఎం వాహనాన్ని కూడా పోలీసులు గుర్తించారు. దానిలో మిగతా డీజిల్, మొత్తం ఆరుగురు ముఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నట్లు అదనపు ఎస్పీ వెల్లడించారు. డీజిల్ దొంగల ముఠాను నల్లగొండ డీఎస్పీ కె.శివరాం రెడ్డి పర్యవేక్షంలో పట్టుకోవడంలో ప్రతిభ కనపరిచిన నల్లగొండ సి.సి.ఎస్ ఇన్‌స్పెక్టర్లు ఎమ్.జితేంధర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, చిట్యాల సీఐ నాగరాజు, చిట్యాల ఎస్.ఐ రవి కుమార్, సిసిఎస్ ఎస్ఐలు విజయ్ కుమార్, మధు, సతీష్ వర్మ, సి.సి.ఎస్ హెడ్ కానిస్టేబుల్స్ విష్ణువర్ధన గిరి, పుష్పగిరి, వహీద్ పాషా, శ్రీను, కానిస్టే బుల్స్, అస్రర్, దస్తగిరి, సాయి కుమార్, జూనేద్, శివరాజు, నరేశ్, సిసిఎస్ ఇతర సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి రివార్డులను ప్రకటించారు.

# నేటి జీవనశైలిలో శారీరక వ్యాయామం ఎంతో అవసరం : ఎమ్మెల్యే నాయిని




హన్మకొండ, ఏప్రిల్ 11: వరంగల్ డిస్ట్రిక్ టెన్నిస్ అసోసియేషన్(డబ్ల్యూడీటీఏ) ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకమైన డబ్ల్యూడీటీఏ-2026 ఇంటర్ డిస్ట్రిక్ట్ టెన్నిస్ టోర్నమెంట్స్ ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. రెండురోజుల పోటీలను శనివారం హనుమకొండలోని ఆఫీసర్స్? క్లబ్‌లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పాల్గొని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి జీవనశైలిలో శారీరక వ్యాయామం ఎంతో ముఖ్యమన్నారు.

నిరంతర క్రీడలు యువతను క్రీడల వైపు ప్రోత్సహించడంలో ముఖ్యపాత్ర పోషిస్తాయని తెలిపారు. డబ్ల్యూడీటీఏ అధ్యక్షుడు గంద్ర సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ క్రీడలు జీవితంలో అవిభాజ్యభాగంగా ఉండాలని, ప్రాథమిక విద్య నుంచి గ్రాడ్యుయేషన్ వరకు క్రీడలను తప్పనిసరి చేయాలని సూచించారు.

ఈ టోర్నమెంట్‌లో మొత్తం 90 జట్లు పాల్గొన్నట్లు వివరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఏసీపీ నరసింహారావు, మురుగన్, కన్నారెడ్డి, టి.బాబురెడ్డి, కమల్, డాక్టర్ జయసింహారెడ్డి, రవీంద్రనాథ్, ప్రభాకర్‌రావు, వీఎస్ రెడ్డి, జి.రవీందర్, దుర్గాప్రసాద్, శరత్, డాక్టర్ ప్రవీణ్ (డెంటల్), తెలుగు రామకృష్ణ పాల్గొన్నారు.

# లక్ష్మీదేవిపల్లిలో ఆర్టిజన్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఖమ్మం, ఏప్రిల్ 11: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఖమ్మం జిల్లా పాల్వంచలోని కేటీపీఎస్ ఎదుట దీక్షలు చేస్తున్న ఆర్టిజన్లకు సంఘీభావం తెలపడానికి వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న సుమారు 60 మందిని లక్ష్మీదేవిపల్లి పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. రాష్ట్రంలోని ఇతర విద్యుత్ ప్లాంట్‌లలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులు రెండు బస్సుల్లో కొత్తగూడెం మీదుగా పాల్వంచలోని కేటీపీఎస్‌కు వెళ్లి దీక్షకు సంఘీభావం తెలపడానికి వస్తుండగా సమాచారం తెలుసుకున్న లక్ష్మీదేవిపల్లి ఎస్సై రమణారెడ్డి ఆ బస్సులను అడ్డుకున్నారు. శాంతిభద్రతల దృష్ట్యా బస్సుల్లో వస్తున్న వారందరినీ లక్ష్మీదేవిపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించారు.

**అడ్డుకోవడం హేయమైన చర్య**

శాంతియుత మార్గంలో ఆందోళన చేస్తున్న ఆర్టిజన్లకు మద్దతు తెలిపేందుకు వెళ్తున్న వారిని పోలీసులు అడ్డుకుని అదులోకి తీసుకోవడం హేయమైన చర్య అని వారు అభిప్రాయపడ్డారు. మా న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోరుతూ దీక్షలు కొనసాగిస్తున్న తోటి ఆర్టిజన్లకు సంఘీభావం తెలిపేందుకు వెళ్తున్న తమను అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా, మా ఆందోళనను నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని, లేనిపక్షంలో ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

# నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే సునీత..



అమరావతి, ఏప్రిల్ 11: పంచాయతీ రాజ్ రెవెన్యూ విభాగాల్లో ఇటీవల ఎక్కువగా ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని వీటి పై అధికారులు దృష్టి సారించాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. టిడిపి క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించారు.రాప్తాడు నియోజకవర్గం లోని వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాలను ఎమ్మెల్యేకు అందజేశారు.ఇందులో ప్రధానంగా పంచాయతీరాజ్ విభాగంలో ఎక్కువగా 21 రెవెన్యూ విభాగంలో 17 అర్జీలు వచ్చాయి.

ఇరిగేషన్ కి సంబంధించి 5 ఆర్.అండ్.బి విభాగానికి సంబంధించి 3 ఫిర్యాదులు వచ్చాయి. ప్రతి ఒక్కరితో ఎమ్మెల్యే సునీత ఓపిగ్గా మాట్లాడి సమస్యలు విన్నారు.కొన్ని సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపించాలని అధికారులను ఆదేశించారు. మిగిలిన వాటిని నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలన్నారు. ప్రజలు ఒకసారి ఇచ్చిన అర్జీలకు కచ్చితమైన పరిష్కారం ఉండాలన్నారు.వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్య లేకుండా చూసుకోవాలన్నారు.

ఇందుకు అవసరం మేరకు నిధులు కూడా సిద్ధం చేయాలన్నారు. భూసమస్యల మీద ఇరు పక్షాలు చర్చించి సామరస్యపూర్వకంగా పరిష్కరించుకుంటే మంచిదన్నారు.మరోవైపు ఆన్‌లైన్ రికార్డుల మార్పుల మీద చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం అనంతరం రాప్తాడు నియోజకవర్గ అభివృద్ధి దిశగా రూపొందించిన స్వర్ణ రాప్తాడు మార్చి నెల న్యూస్ లెటర్‌ను ఎమ్మెల్యే పరిటాల సునీత ఆవిష్కరించారు. ఈ న్యూస్ లెటర్‌ను నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళిక విభాగం వాళ్ళు తయారు చేశారని తెలిపారు. ఇందులో నియోజకవర్గంలో అమలవుతున్న అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ పథకాలు ప్రజల భాగస్వామ్యంతో జరుగుతున్న ప్రగతి కార్యక్రమాలను ప్రతిబింబించేలా అంశాలను పొందుపరిచారని ఉన్నారు.

పారదర్శకత ప్రజలతో అనుసంధానం మరియు అభివృద్ధి లక్ష్యాల సాధనలో ఒక ముఖ్యమైన అడుగు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాప్తాడు మండల కన్వీనర్ పంపు కొండప్ప ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి శ్రీనివాసులు రాప్తాడు మార్కెట్ యార్డ్ చైర్మన్ సుధాకర్ నాయుడు ఎస్సీ సెల్ హిందూపురం పార్లమెంటు అధికార ప్రతినిధి రొద్దం ముత్యాలప్ప క్లస్టర్ ఇన్చార్జిలు సోమరనారాయణ స్వామి సిసి రాము మహిళలు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# వ్యవసాయ అధికారులపై మాజీ మంత్రి హరీష్‌రావు ఫైర్



సిద్దిపేట, ఏప్రిల్ 11:: మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు శనివారం వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించారు. పొద్దు తిరుగుడు మొక్కజొన్న , ధాన్యంను నాలుగు రోజుల నుంచి కొనుగోలు చేయడం లేదని రైతులు ఫిర్యాదు చేయడంతో హరీష్‌రావు యార్డును సందర్శించి అధికారులతో మాట్లాడి ఆగ్రహం వ్యక్తం చేశారు.

అధికారులు మార్కెట్ యార్డును సందర్శించి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆరోపించారు. రైతుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని, పంట కొనుగోలులో నిరక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. నారాయణ కేడ్, ఆదిలాబాద్, నిజామాబాద్ కేంద్రాల్లో జొన్న కొనుగోలు సెంటర్లను ప్రారంభించ లేదని ఆరోపించారు.

రేవంత్ రెడ్డి పంట మార్పిడి చేయమని చెబుతున్నారు. కానీ రైతులు పంట మార్పిడి చేస్తే వాటిని కొనే దిక్కు లేదని మండిపడ్డారు. పలు జిల్లాల లో వడగళ్ల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు సమయానికి రైతు బంధు ఇవ్వాలని కోరారు.

పూలే జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు . బీసీ డిక్లరేషన్ పేరిట రేవంత్ రెడ్డి బీసీ లను మోసం చేశారని, కేసీఆర్ అన్ని కుల వృత్తులను ప్రోత్సహించారని గుర్తు చేశారు. బీసీ లను రేవంత్ రెడ్డి ప్రభుత్వం దగా చేసిందని, బీసీ విద్యార్థుల ఫీజు రియాంబర్స్ మెంట్ వెంటనే విడుదల చేయాలని కోరారు

# లారీని ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు.. 16 మందికి గాయాలు




నల్గొండ, ఏప్రిల్ 11:కోదాడ బైపాస్ వద్ద 65వ జాతీయ ప్రధాన రహదారిపై శనివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు లారీని వెనుక నుండి ఢీ కొట్టిన దుర్ఘటనలో 16 మందికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు, ప్రయాణికులు వెల్లడించిన వివరాలు ప్రకారం.. హైదరాబాద్ నుండి ఏలూరు వైపు వెళ్తున్న ఇంటర్ సిటీ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు కోదాడ బైపాస్ వద్ద ప్రధాన రహదారిపై వెనుక నుండి లారీని బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం నుజ్జు కాగా అందులో ప్రయాణం చేస్తున్న 46 మందిలో 16 మందికి స్వల్ప గాయాలు అయ్యాయి. అక్కడికి చేరుకున్న పోలీసులు 108 వాహనంలో క్షతగాత్రులను కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ నిద్ర మత్తులో ఉండటం వల్లే ఈ ప్రమాదం జరిగిందని బస్సులోని ప్రయాణికులు తెలిపారు. బస్సు మరో డ్రైవర్ సంఘటన స్థలం నుండి పారిపోయాడు.

బస్సు ప్రమాద ఘటనపై రాష్ట్ర రోడ్లు రవాణా, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆరా తీశారు. స్థానిక అధికారులతో మంత్రి ఫోన్ లో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. ప్రయాణికులు ఎవరికీ ప్రాణాపాయం లేదని, కొంది మందికి స్వల్ప గాయాలు కాగా కోదాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించినట్లు అధికారులు మంత్రికి వివరించారు. గాయాలైన వ్యక్తులకు మెరుగైన చికిత్స చేయించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహించి ప్రమాదానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించినట్లు సమాచారం. కోదాడ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

ఆదిలాబాద్, ఏప్రిల్ 11:ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని బీఆర్టీయూ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ఎండీ హబీబ్ పాషాఆరోపించారు. శనివారం తాండూర్ మండల కేంద్రం ఐబీలో మండల ఆటో యూనియన్ సహకారంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆటో డ్రైవర్లకు ప్రమాద బీమా ఐదు లక్షల రూపాయల పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందనఇ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం (ఫ్రీ బస్సు) వల్ల ఆర్థిక ఇబ్బందులతో ఇప్పటి వరకు 120 మంది ఆటో కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని పేర్కొన్నారు. చనిపోయిన ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

# పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

ఖమ్మం, ఏప్రిల్ 11: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బూర్గంపహాడ్ మండల పరిధిలోని మణుగూరు క్రాస్ రోడ్డు సమీపంలోని సందెళ్ల రామాపురంలో చోటుచేసుకుంది. ఎస్ఐ నాగభిక్షం తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ మండలం దంతెలబోరు గ్రామానికి చెందిన నూనె వినయ్ కుమార్ (25) కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్థాపం చెంది శుక్రవారం రాత్రి మణుగూరు క్రాస్ రోడ్డులోని సందెళ్ల రామాపురం సమీపంలో పురుగుల మందు తాగి మృతి చెందాడు. మృతుడి తల్లి నూనె వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# బోడె రామచంద్ర యాదవ్ ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభం

**-బీసీల అభ్యున్నతికి ధర్మ దీక్ష..**
**-మండల్ వారసుల మద్దతు..**
**-ఐదు డిమాండ్లపై పోరాటం**




అమరావతి, ఏప్రిల్ 11: బీసీ సామాజిక వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభమైంది. మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయ ఆవరణలో మొదలైన ధర్మ దీక్షకు పలు బీసీ సంఘాల నాయకులు హాజరయ్యారు. గతంలో నిర్వహించిన "బీసీ సింహగర్జన" సభలో ఐదు కీలక డిమాండ్లను ఆయన ప్రస్తావించారు. అయితే.. వాటిపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో ఈ దీక్షకు సిద్దమైనట్లు రామచంద్ర యాదవ్ ప్రకటించారు.

అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం, ఓబీసీ రిజర్వేషన్ల కోసం పాటుపడిన బీపీ మండల్ మనుముడు డా.సూరజ్ మండల్ ఈ కార్యక్రమానికి హాజరై రామచంద్ర యాదవ్ చేస్తున్న దీక్షకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సూరజ్ మండల్, జ్యోతిబా పూలే మనుమరాలు డా.ఎస్.పూలే మాట్లాడుతూ? బీసీ వర్గాల అభ్యున్నతి కోసం రామచంద్ర యాదవ్ చేస్తున్న పోరాటం అభినందనీయమని, అన్ని వేళలా సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని వ్యాఖ్యానించారు. బీసీలందరి మద్దతుతోనే రాజ్యాధికారం సిద్ధిస్తుందని, అప్పుడే సమన్యాయం జరుగుతుందని వ్యాఖ్యానించారు.

# ఎన్నికలు ఎప్పుడొచ్చినా అవి కేసీఆర్ ఎన్నికలే: కేటీఆర్



హైదరాబాద్, ఏప్రిల్ 11:ఈ అరాచక పాలనను అంతమొందించాలంటే కొత్తతరం నాయకత్వం రావాల్సిన అవసరం ఉంది. రాబోయే రోజుల్లో ఎన్నికలు ఎప్పుడొచ్చినా అవి కేసీఆర్ ఎన్నికలుగానే ఉంటాయి.. అసెంబ్లీ ఎన్నికలు కాదు. కేసీఆర్ ఎన్నికలే ఈ రాష్ట్రంలో జరుగుతాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు.

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ తిరిగి అధికారంలోకి వచ్చే ఎన్నికలే జరుగుతయని నాకు విశ్వాసముందన్నారు. ఇది నా ఆలోచన కాదు.. రాష్ట్రంలో ఎవరినైనా అన్నా ఎట్లున్నది పరిస్థితి అని అడగండి. రైతన్నల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. నేను జగిత్యాలకు పోతే అక్కడ ఓ రైతు సోదరుడు కలిసిండు. అన్న ఎట్లున్నది పరిస్థితి అని అడిగిన. ఆ ఏముంది సార్ మూడు సార్లు రైతు బంధు ఎగ్గొట్టిండు. రూ.27 వేల కోట్లు మిగిలినయి. అందులో నుంచి 20 వేల కోట్లు ఇచ్చి రుణమాఫీ చేసినా అని డబ్బా కొట్టుకుంటున్నడు. మా పైసలు మాకే ఇచ్చి మిదికెల్లి బాకీ ఉన్నడు.. కానీ బయటకు మాత్రం రైతు బంధు ఎగ్గొట్టిన అని చెప్పడు. రుణమాఫీ చేసినా అని చెప్పి.. అది కూడా ఊరిలో చారానా మందికి చేసిండు. బారానా మందికి కాలేదు. అగో గట్లుంది పాలనా అని ఒకే ఒక్కమాటలో రైతన్న చెబుతున్నడు.

ఏ యువకుడినైనా అడగండి రెండు లక్షల ఉద్యోగాలని ఊరించి పెద్ద పెద్ద మాటలు చెప్పి చివరకు మోసం చేసి గద్దెనెక్కి.. ఇంతవరకు రెండున్నర సంవత్సరాల్లో 11 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు. మహిళలకు స్కూటీలు, తులం బంగారం అన్నడు.. నెలకు రూ.2500 ఇస్తా అన్నడు.. అత్తకు రూ.4 వేలు, కోడలుకు రెండున్నర వేలు నోటికి ఎంతొస్తే అంత మాటలిచ్చి మహిళలను మోసం చేసిండు. కేసీఆర్ రాకముందు 200 పెన్షన్ వచ్చేది. కేసీఆర్ దాన్ని రూ.2 వేలు చేసిండు. నవంబర్‌లో అయితే రూ.2వేలు, డిసెంబర్‌లో అయితే 4 వేలు అని చెప్పిండు. ముసలోళ్లను కూడా మోసం చేసిండు. రెండు నెలలు ఇప్పటికీ పెన్షన్ ఎగ్గొట్టిండు. 28 నెలల్లో సాధించింది ఏమైనా ఉందంటే ఒకే ఒక్కటి ఢిల్లీకి పోవుడు. వచ్చుడు.. ఎక్కే విమానం.. పోయే విమానం తప్ప ఈ రాష్ట్రంలో చేసింది మాత్రం ఏమీ లేదన్నాడు.

అరటి పండ్ల బండ్లను కూడా విడిచిపెట్టడట. ..

మీ ఎమ్మెల్యే గురించైతే నేను చెప్పే అవసరమే లేదు. ఆయన ఎట్లాంటోడో ఏమేం వసూళ్లు చేస్తడో నాకంటే బాగా మీకే తెలుసు. ఆఖరికి అరటి పండ్ల బండ్లను కూడా విడిచిపెట్టడట అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. గట్లాంటోడి గురించి నేను మాట్లాడ కని.. ఒకటి మాత్రం పక్కా. మంచి రెడ్డి లాంటి మంచి నాయకుడిని కోల్పోవడం వల్ల ఆయనకేం నష్టం కాలేదు. ఆయన బాగానే ఉన్నడు.. కానీ నష్టపోయింది ఇబ్రహీం పట్నం ప్రజలు అని గుర్తు చేస్తున్నా. మంచి నాయకుడు కేసీఆర్‌ను కోల్పోయినం. ఇబ్రహీంపట్నంలో మంచి రెడ్డి కిషన్ రెడ్డి లాంటి మంచి నాయకుడిని పోగొట్టుకున్నం. అందుకే ఈ ప్రభుత్వం చేస్తున్న అరాచకలు నా కంటే బాగా మీకే తెలుసనన్నారు కేటీఆర్.

# ఓఎస్డీగా ఉన్న రిటైర్డ్ అధికారి అవినీతికి అంతే లేదు : మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్, ఏప్రిల్ 11: తెలంగాణలో నీళ్లు, నిధులు నియామకాల్లో అన్యాయం జరుగుతోందని.. ఆంధ్రా నుంచి వచ్చి రావడంతోనే ఓ అధికారికి ఎక్సైజ్ శాఖ కమిషనర్ పదవి ఇచ్చారని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రా అధికారులకు కీలక పోస్టింగ్స్ ఇచ్చి తెలంగాణ అధికారులను అవమానిస్తున్నారు. ఆ ఆంధ్రా అధికారి తీరు వల్ల తెలంగాణ అధికారుల ఆరోగ్యాలు పాడవుతున్నాయి. ఆ ఆంధ్రా అధికారి తిట్ల దండకంతో తెలంగాణ ఉద్యోగులకు గుండె పోట్లు వస్తున్నాయి. బీసీ, ఎస్సీ , ఎస్టీలను కులం పేరుతో ఆ అధికారి దూషిస్తున్నాడు.

సోమిరెడ్డి అనే సిన్సియర్ అధికారి ఆ ఆంధ్రా అధికారి తిట్లకు కుప్ప కూలిపోయారు..ఆయన ఇప్పుడు కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. రిజ్వి అనే అధికారి ఇప్పటికే ఈ ప్రభుత్వం తీరుతో బలవంతంగా పదవీవిరమణ తీసుకున్నారు. ఎక్సైజ్ శాఖ మంత్రి దగ్గర ఓఎస్డీగా ఉన్న రిటైర్డ్ అధికారి అవినీతికి అంతే లేదు. కూకట్ పల్లిలో ఓ వైన్ షాప్‌లో ఆంధ్రా మద్యం దొరికింది. ఆంధ్రా మద్యం తెలంగాణలోకి ఎలా వచ్చింది..? ఆ మద్యాన్ని పట్టుకుని కొంత ఫైన్ వేసి లక్షల్లో లంచం తీసుకున్నారు.. ఈ లంచం నేరుగా మంత్రి ఓఎస్డీకే వెళ్లింది. ఇలాంటి ఘటనలు కోకొల్లలుగా జరుగుతున్నాయి. ఈ అవినీతి ఇట్లా ఉంటె ఆంధ్రా అధికారుల పెత్తనం మరో వైపు తెలంగాణ ఉద్యోగుల పట్ల శాపంలా మారుతోందన్నారు.

తెలంగాణ ఉద్యోగుల పట్ల ఆంధ్రా అధికారుల వైఖరి మారకపోతే మరో ఉద్యమం వస్తుందని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చినాక కూడా ఆంధ్రా ఉద్యోగుల పెత్తనం ఏమిటీ సోమిరెడ్డికి హ్యాట్సాఫ్ చెప్పాలి. ఆంధ్రా అధికారి బూతులతో ఇక తాను ఉద్యోగం చేయనని ఆత్మగౌరవం ప్రదర్శించారు. తెలంగాణ ఉద్యోగులు సోమి రెడ్డి లాగా ధైర్యాన్ని ప్రదర్శించాలి. తెలంగాణ ఆత్మగౌరవం దెబ్బ తీస్తున్న ఆంధ్రా అధికారులకు తగిన బుద్ధి చెప్పాలి. ఉద్యోగులను వేధించిన ఎక్సైజ్ కమిషనర్ హరి కిరణ్‌ను తక్షణమే విధుల నుంచి తప్పించాలి.. ఆయన ఎవరి రికమండేషన్‌తో ఆ పదవిలోకి వచ్చారో లోతుగా తెలుసుకుంటాం.

# అంతరిక్ష రంగంలో భారత్ ముందంజ

## ఏప్రిల్ 12...అంతర్జాతీయ మానవ అంతరిక్ష యాత్ర దినోత్సవం

అంతరిక్ష విజ్ఞాన రంగంలో భారత్ సాధిస్తున్న ప్రగతి కేవలం ప్రయోగాలకు పరిమితం కాకుండా, ప్రపంచ యవనికపై ఒక అగ్రగామి శక్తిగా మన దేశాన్ని నిలబెడుతోంది. ఏప్రిల్ 12 "అంతర్జాతీయ మానవ అంతరిక్ష యాత్ర దినోత్సవం" సందర్భంగా, మానవాళి సాధించిన అద్భుతాలను గుర్తు చేసుకుంటూనే, భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ప్రయాణాన్ని, దాని వెనుక ఉన్న కృషిని విశ్లేషించుకోవడం సముచితం. 1961 ఏప్రిల్ 12న సోవియట్ యూనియన్‌కు చెందిన యూరీ గగారిన్ 'వోస్టోక్-1' నౌకలో భూకక్ష్యలోకి ప్రవేశించి, అంతరిక్షంలోకి వెళ్ళిన తొలి మానవుడిగా చరిత్ర సృష్టించారు. ఈ చారిత్రాత్మక ఘట్టానికి 50 ఏళ్లు నిండిన సందర్భంగా, 2011లో ఐక్య రాజ్య సమితి ఏప్రిల్ 12ను అంతర్జాతీయ మానవ అంతరిక్ష యాత్ర దినోత్సవంగా ప్రకటించింది. ఈ నేపథ్యం ప్రపంచానికి ఒక ఎత్తయితే, భారత్ సున్నా నుండి శిఖరానికి చేరుకున్న వైనం మరో అద్భుత చరిత్ర.

భారత అంతరిక్ష పితామహుడు డాక్టర్ విక్రమ్ సారాభాయ్ దూరదృష్టి నేడు భారత్‌ను అంతరిక్ష దిగ్గజంగా మార్చింది. 1957లో రష్యా 'స్పుత్నిక్' ప్రయోగించినప్పుడు, అంతరిక్ష పరిజ్ఞానం కేవలం విలాసం కాదని, దేశాభివృద్ధికి అదొక అవసరమని సారాభాయ్ గుర్తించారు. హోమీ బాభా సహకారంతో 1962లో 'ఇన్కోస్పార్' ఏర్పాటు కావడం, కేరళలోని తుంబాలో ఒక చర్చి ప్రాంగణంలో రాకెట్ ప్రయోగాలు మొదలుపెట్టడం భారత అంతరిక్ష గాథలో అత్యంత స్ఫూర్తిదాయకమైన ఘట్టాలు. సైకిళ్లపై రాకెట్ విడిభాగాలను, ఎడ్ల బండ్లపై ఉపగ్రహాలను తీసుకెళ్లిన రోజుల నుండి నేడు ప్రపంచ దేశాల ఉపగ్రహాలను అతి




తక్కువ ఖర్చుతో కక్ష్యలోకి చేర్చే స్థాయికి మనం ఎదిగాం. 1975 ఏప్రిల్ 19న మన తొలి ఉపగ్రహం 'ఆర్యభట్ట'ను సోవియట్ యూనియన్ సహాయంతో ప్రయోగించిన భారత్, నేడు తన స్వంత వాహక నౌకలైన PSLV, GSLV లతో ప్రపంచ రికార్డులను సృష్టిస్తోంది.

భారత అంతరిక్ష రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన వ్యవస్థలలో 'ఇన్‌శాట్' శ్రేణి ప్రధానమైనది. 1983లో ప్రారంభమైన ఈ వ్యవస్థ ఆసియా-పసిఫిక్ ప్రాంతంలోనే అతిపెద్ద సమాచార ఉపగ్రహ వ్యవస్థగా ఎదిగింది. ప్రస్తుతం వందలాది ట్రాన్స్‌పాండర్ల సహాయంతో టెలివిజన్ ప్రసారాలు, రేడియో నెట్‌వర్క్, వాతావరణ హెచ్చరికలు, విపత్తు నిర్వహణ వంటి సేవలను అందిస్తోంది. హస్సన్ (కర్ణాటక), భోపాల్ (మధ్యప్రదేశ్) కేంద్రాల నుండి ఈ ఉపగ్రహాలను నిరంతరం పర్యవేక్షిస్తుంటారు. అంతరిక్ష ప్రయోగాలపై పెట్టే ఖర్చు వృధా అని భావించే వారికి ఇస్రో సాధించిన విజయాలే సమాధానం. ఉదాహరణకు, అమెరికా వంటి దేశాలు అంగారక యాత్ర కోసం వేల కోట్లు ఖర్చు చేస్తే, భారత్ కేవలం 450 కోట్ల రూపాయలతో (సుమారు 74 మిలియన్ డాలర్లు), హాలీవుడ్ సినిమా నిర్మాణ వ్యయం కంటే తక్కువతో మొదటి ప్రయత్నంలోనే విజయం సాధించి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచింది.

ప్రస్తుతం భారత్ వద్ద మూడు ప్రధాన ప్రయోగ కేంద్రాలు ఉన్నాయి. తుంబా (కేరళ)లో రాకెట్ విడిభాగాల తయారీ మరియు వాతావరణ రాకెట్ల ప్రయోగాలు జరుగుతుంటే, శ్రీహరికోట (ఆంధ్రప్రదేశ్) లోని 'సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం' (రాఊంఖీ) ప్రధాన ప్రయోగ వేదికగా నిలుస్తోంది. ఇక్కడ ఉన్న రెండు లాంచ్ ప్యాడ్ల ద్వారా ఏడాదికి పలు ఉపగ్రహాలను ప్రయోగించే సామర్థ్యం మనకుంది. ఒరిస్సాలోని బలేశ్వర్ కేంద్రం ప్రధానంగా క్షిపణి పరీక్షలకు వేదికగా ఉంది. ఇస్రో చరిత్రలో మైలురాళ్ళుగా నిలిచిన సంఘటనలు అనేకం. 2017లో పి.ఎస్.ఎల్.వి-సి37 ద్వారా ఒకేసారి 104 ఉపగ్రహాలను ప్రయోగించి భారత్ ప్రపంచ రికార్డు సృష్టించింది. ఇందులో 96 ఉపగ్రహాలు అమెరికావే కావడం విశేషం. ఇది భారత వాహక నౌకల విశ్వసనీయతకు మరియు తక్కువ వ్యయానికి నిదర్శనం.

ఇటీవలి కాలంలో అంతరిక్ష రంగంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పెను మార్పులకు నాంది పలికింది. 'ఇన్-స్పేస్' వంటి సంస్థల ద్వారా ప్రైవేటు స్టార్టప్‌లు అంతరిక్ష రంగంలోకి అడుగుపెట్టాయి. దీనివల్ల ఆర్థిక లావాదేవీలు పెరగడమే కాకుండా, సాంకేతికతలో వినూత్న ఆవిష్కరణలు చోటు చేసుకుంటున్నాయి. గత దశాబ్ద కాలంలో భారత్ 34 దేశాలకు చెందిన సుమారు 393 ఉపగ్రహాలను వాణిజ్యపరంగా ప్రయోగించి భారీ విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించింది. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జపాన్ వంటి అగ్రదేశాలు సైతం నేడు ఇస్రో సేవలను వినియోగించుకుంటున్నాయంటే మన ప్రాముఖ్యత ఎంత పెరిగిందో అర్థం చేసుకోవచ్చు.

2023వ సంవత్సరం భారత అంతరిక్ష చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గది. 'చంద్రయాన్-3' మిషన్ ద్వారా చంద్రుని దక్షిణ ధ్రువంపై సాఫ్ట్ ల్యాండింగ్ చేసిన మొదటి దేశంగా భారత్ అవతరించింది. దీని వెనుక శాస్త్రవేత్తల దశాబ్దాల కఠోర శ్రమ దాగి ఉంది. కేవలం చంద్రుడికే పరిమితం కాకుండా, సూర్యుడిపై అధ్యయనం కోసం 'ఆదిత్య-ఎల్1'ను విజయవంతంగా ప్రయోగించాం. రానున్న రోజుల్లో 'గగన్ యాన్' ద్వారా భారతీయులను అంతరిక్షంలోకి పంపే బృహత్తర కార్యక్రమం సిద్ధమవుతోంది. ఇది విజయవంతమైతే, అమెరికా, రష్యా, చైనా తర్వాత సొంతంగా మానవ అంతరిక్ష యాత్ర చేపట్టిన నాలుగో దేశంగా భారత్ నిలుస్తుంది.

ముగింపుగా చూస్తే, అంతరిక్షం అనేది కేవలం నక్షత్రాల అన్వేషణ మాత్రమే కాదు, అది దేశ భద్రత, ఆర్థికాభివృద్ధి మరియు సాంకేతిక సార్వభౌమాధికారానికి నిదర్శనం. విక్రమ్ సారాభాయ్ వేసిన పునాది, అబ్దుల్ కలాం అందించిన క్షిపణి పరిజ్ఞానం, సతీష్ ధావన్ నేతృత్వంలో జరిగిన అభివృద్ధి నేడు సోమనాథ్ వంటి నాయకత్వంలో శిఖరాగ్రానికి చేరుతోంది. అంతర్జాతీయ మానవ అంతరిక్ష యాత్ర దినోత్సవం జరుపుకుంటున్న ఈ తరుణంలో, భారత్ తనదైన ముద్రను విశ్వవ్యాప్తంగా వేస్తూ, 'వసుధైక కుటుంబకం' స్ఫూర్తితో అంతరిక్ష ఫలాలను సామాన్య మానవుడికి సైతం చేరువ చేస్తోంది. రాబోయే కాలంలో అంతరిక్ష పర్యాటకం, అంతరిక్ష స్టేషన్ నిర్మాణం వంటి రంగాల్లోనూ భారత్ అగ్రగామిగా నిలవడం ఖాయంగా కనిపిస్తోంది.



-రామ కిష్టయ్య సంగన భట్ల,
9440595494

---

# మృతుడి కుటుంబానికి అండగా నిలిచిన ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్, పార్టీ నేతలు

## మృతుడి కుటుంబానికి ఎంఐఎం పార్టీ ద్వారా 20వేలు, ఇంటి ఓనర్ ద్వారా 2లక్షల ఆర్థిక సాయం



కరీంనగర్, ఏప్రిల్ 11:(నేటినిజం ప్రతినిధి) బీహార్ రాష్ట్రంలోని సిపోల్ జిల్లా బలువ బజార్ థానా పరిధిలోని మధుబని గ్రామానికి చెందిన నివాసి, ముంతాజ్ ఆలం (38) అనే టైల్స్ కార్మికుడు కరీంనగర్ పట్టణంలోని ముకరంపుర ప్రాంతంలో తన కుటుంబం తో సహా వచ్చి నివాసముంటున్నాడు. శుక్రవారం ఉదయం కరీంనగర్ సవారణ్ స్ట్రీట్ లోని ఒక డాక్టర్ నివాసంలో రోజువారిగా టైల్స్ పరిచే పనికి వెళ్లగా సాయంత్రం 4గంటల ప్రాంతంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్నారు. ఎంఐఎం అధినేత బారిష్టర్ అసబద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు, బీహార్ రాష్ట్ర ఎంఐఎం అధికార ప్రతినిధి అడ్వకేట్ ఆదిల్ హసన్ సూచనల మేరకు ఈసమాచారం అందుకున్న వెంటనే, ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, 59వ డివిజన్ ముకరంపుర కార్పొరేటర్ మాజిద్ హుస్సేన్ తో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ముంతాజ్ ఆలం మృతికి గల కారణాలను తెలుసుకొని కరీంనగర్ 2వ పట్టణ పోలీసు స్టేషన్లో కేసు నమోదు చేయించి, బాధిత కుటుంబానికి బాసటగా నిలిచారు. మృతుడు పని చేస్తున్న ఇంటి ఓనర్ తో మాట్లాడి బాధిత కుటుంబానికి రూ. 2లక్షలు సాయం అందించే విధంగా కృషి చేశారు. ఇంతేగాక ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ రూ.10వేల నగదును, గోదాం గడ్డ కు చెందిన సోషల్ వర్కర్ అబ్దుల్ గఫ్ఫార్ లయన్ రూ.10వేల నగదును వేర్వేరుగా ఆర్థిక సాయం అందించి, మానవతకు మారుపేరుగా నిలిచారు. పోస్టుమార్టం నిర్వహించి, ట్రాన్స్పోర్టు డెత్ సర్టిఫికెట్ ను పోలీసులతో వ్రాయించి, బీహార్ రాష్ట్రంలోని మృతుడి స్వంత గ్రామం వరకు మృతదేహాన్ని తరలించేందుకు అంబులెన్స్ ను మాట్లాడి, మృతుడి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లే ఏర్పాటు చేశారు. గత రాత్రి నుంచి ఈరోజు మధ్యాహ్నం వరకు అక్కడే ఉండి ఈ కార్యక్రమాన్ని పూర్తి గావించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈ అంశానికి సంబంధించిన పూర్తి సమాచార వివరాలను బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీకి, బీహార్ రాష్ట్ర ఎంఐఎం అధికార ప్రతినిధి ఆదిల్ హసన్ కు ఫోన్ ద్వారా సమాచారం అందించినట్లు గులాం అహ్మద్ తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, గోదాం గడ్డ సోషల్ వర్కర్ అబ్దుల్ గఫ్ఫార్ లయన్, ముకరంపుర ఎంఐఎం నాయకులు తఫజ్జుల్ రహమాన్, హాఫీజ్ హైదర్,తదితరులు పాల్గొన్నారు.

---

# 'కార్మికుల శ్రమను గుర్తించని ఐటీసీ యాజమాన్యం'

## -కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ

ఖమ్మం, ఏప్రిల్ 11:కాంట్రాక్టు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఐటీసీ యాజమాన్యం కనీసం గుర్తించడం లేదని, ఏదేమైనా రానున్న రోజుల్లో రిలే దీక్షలు కాస్తా సమ్మెగా మారతాయని కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ కన్వీనర్ పాటి సోమిరెడ్డి, కో కన్వీనర్లు సానికొమ్ము రామచంద్రారెడ్డి, బల్లెం నాగయ్య, ఎండీ యాకూబ్‌పాషా హెచ్చరించారు. శనివారం 17వ రోజుకు చేరిన దీక్షా శిబిరంలో కార్మిక సంఘం జేఏసీ కో కన్వీనర్లు షేక్ యాకూబ్‌పాషా, బల్లెం నాగయ్య, ఆకిని సర్వేశ్వరరావు, సభ్యులు మర్రి వెంకటరెడ్డి, మహిళా కార్మికురాలు డి.మణి దీక్షల్లో పాల్గొని కాంట్రాక్టు కార్మికులకు మద్దతు పలికి వారి న్యాయమైన కోర్కెలు యాజమాన్యం తీర్చాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జేఏసీ బాధ్యులు మాట్లాడుతూ.. కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత ఐటీసీపై ఉందన్నారు.

అయితే ఇప్పటికీ కూడా ఐటీసీ కార్మికుల శ్రమను గుర్తించడం లేదని, రిలే దీక్షలు చేపట్టి 17 రోజులైనా ఐటీసీ యాజమాన్యం కార్మికుల శ్రమను గుర్తించడంలో మార్పు రాకపోవడం సిగ్గు చేటన్నారు. ఇప్పటికైనా కార్మిక సంఘం నాయకులను చర్చలకు పిలిచి కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించని పక్షంలో సమ్మెబాట తప్పదని హెచ్చరించారు. ఈ దీక్షా శిబిరంలో జేఏసీ సభ్యుడు సుంకిరెడ్డి వెంకటరెడ్డి, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

---

# సామాజిక సమానత్వానికి మార్గదర్శి జ్యోతిరావు పూలే

## -వేములవాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 11:(నేటినిజం ప్రతినిధి): సామాజిక సమానత్వానికి ప్రాణం పోసిన మహానేత జ్యోతిరావు పూలే అని వేములవాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గొంటి శంకర్ పేర్కొన్నారు. ఫూలే 199వ జయంతి సందర్భంగా శనివారం కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ అణగారిన వర్గాల విద్యాభివృద్ధికి ఫూలే చేసిన కృషి అపారమని కొనియాడారు. మహిళా విద్యకు పునాది వేసిన మహనీయుడిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. నేటి యువత ఫూలే ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమానత్వ సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో గుడిసె సదానందం, పొత్తూరి అనిల్ కుమార్, పెంట రాజు, పార్లపెల్లి అంజయ్య, నక్క దివాకర్, సుంకపాక నవీన్, మారుమొకం అనిల్ కుమార్, వోద్యారపు వేణు కుమార్, గుడిపెల్లి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



---

# భారత సమ సమాజ దార్శనికుడు మహాత్మా జ్యోతిరావు పూలే

## -తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఉద్యోగుల సంఘ నేతలు



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 11:(నేటినిజం ప్రతినిధి): వర్ణ వివక్షకు వ్యతిరేకంగా జీవిత కాలం పోరాడిన సామాజిక విప్లవకారుడు, సమ సమాజ స్థాపన మార్గదర్శి మహాత్మా జ్యోతిరావు పూలే అని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఓబిసి ఉద్యోగుల సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు కొండపలకల వేణుమాధవ్, ప్రాంతీయ కార్యదర్శి ఆలేటి రమేష్ కొనియాడారు. మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా శనివారం బ్యాంక్ రీజనల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారు పూలేకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహాత్మ పూలే జాతికి చేసిన సేవలను స్మరించుకున్నారు. సమాజంలో వెళ్లూనుకుపోయిన వర్ణ, కుల, లింగ వివక్షను రూపుమాపి,అందరికీ సామాజిక న్యాయం దక్కాలని పోరాడిన దార్శనికుడు మహాత్మా ఫూలే అన్నారు. నబ్బండ వర్ణాలు సామాజిక ఆర్థిక రంగాల్లో ముందడుగు వేయాలంటే విద్య ద్వారా మాత్రమే సాధ్యమౌతుందని భావించిన జ్యోతిరావు ఫూలే ఆశయాలు ఎల్లకాలం ఆచరణీయమైనవని తెలిపారు. ?తన భార్య సావిత్రీబాయి ఫూలేకు చదువు నేర్పించి, చదువు నిరాకరించబడిన మహిళలకు విద్య నేర్పాలనే దృఢ సంకల్పాన్ని అనేక కష్ట నష్టాల నడుమ అమలు చేసిన, మహిళాభ్యుదయ మార్గదర్శి మహాత్మా పూలే అని కొనియాడారు. తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఓబిసి ఉద్యోగుల సంఘం ప్రాంతీయ కార్యదర్శి ఆలేటి రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఎస్సీ, ఎస్టీ, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్ సింగ్, ప్రాంతీయ కార్యదర్శి శేఖర్,ఎన్ఎంఓ కందుల సుబ్బారావు, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జి.తిరుపతి, ప్రాంతీయ కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి, బిఎంఎస్ నాయకులు మూల రమణారెడ్డి,ఉడుత సాయి, కాపర్తి సతీష్, రాహుల్ ముదిమడుగుల, పులస కిరణ్, ఎన్ తిరుపతి, యామ కళ్యాణ్, సీనియర్ మేనేజర్ మురళీధర్ స్వామితో పాటు పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

---

# బీజేపీ ఆధ్వర్యంలో నూతన ప్రెస్ క్లబ్‌కు సన్మానం



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 11:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ ఐజేయు ప్రెస్ క్లబ్‌కు నూతనంగా ఎన్నికైన పాలకవర్గానికి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. అధ్యక్షుడిగా ఎన్నికైన రాపల్లి శ్రీనివాస్ బృందాన్ని బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ ప్రజల సమస్యలను నిరంతరం వెలుగులోకి తీసుకురావడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. అనుక్షణం ప్రజల పక్షాన పోరాడుతూ ప్రతీ విషయాన్ని చేరవేసే గొప్ప పాత్ర మీడియా అని కొనియాడారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడు రాపల్లి శ్రీధర్ మాట్లాడుతూ ప్రజల, ప్రభుత్వం,ప్రతిపక్షాల మధ్య వారధిగా మీడియా వ్యవహరించాలని, బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు. కౌన్సిలర్ ముత్యం మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా మీడియా ప్రాధాన్యతను గుర్తుచేశారు. అసెంబ్లీ, పార్లమెంట్లలో మీడియాకు అనుమతి ఉన్నప్పటికీ మున్సిపల్ సమావేశాలకు అనుమతి లేకపోవడం దురదృష్టకరమన్నారు. రానున్న మున్సిపల్ సమావేశాల్లో మీడియాకు అనుమతి కల్పించేలా బీజేపీ తరఫున పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన ప్రెస్ క్లబ్ పాలకవర్గ సభ్యులు, కుమ్మరి శంకర్, వంగల శ్రీనివాస్, మైలారం శ్రీనివాస్, రేగుల మల్లికార్జున్, వైభవ్ బాలరాజు, కోల కృష్ణ స్వామి, రేగుల శ్రీకాంత్, మామిళ్ల లక్ష్మీరాజ్యం, బోనాల శివ, వివేక్ రెడ్డి, అన్నం నరసయ్య, నామాల శేఖర్, గుడిసె మనోజ్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

---

# మున్సిపల్ కార్యాలయంలో పూలే జయంతి

## – మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు నివాళి



రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 11:(నేటినిజం ప్రతినిధి): దేశ ప్రముఖ సామాజిక సంస్కర్త మహాత్మా జ్యోతిబా పూలే 199వ జయంతిని పురస్కరించుకుని వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే కులవివక్ష నిర్మూలనకు, మహిళా విద్యాభివృద్ధికి కృషి చేసిన మహనీయుడని అన్నారు. 1848 లో పూణేలో తన సహచరి సావిత్రిబాయి ఫూలేతో కలిసి బాలికల కోసం తొలి పాఠశాలను స్థాపించి విద్యా విస్తరణకు నాంది పలికారని తెలిపారు. 'సత్యశోధక్ సమాజ్' స్థాపన ద్వారా సమానత్వ సమాజం కోసం పోరాడారని కొనియాడారు. నేటి యువత పూలే ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నరాల శేఖర్, కమిషనర్ సంపత్ కుమార్, కౌన్సిలర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com